శనివారం
3-12-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 161
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కాస్ట్రోకు మెక్సికన్ కాంగ్రెస్ ఘన నివాళి

క్యూబా మాజీ అధ్యక్షుడు ఫిడెల్ కాస్ట్రోకు మెక్సికన్ కాంగ్రెస్ ఘనంగా నివాళు లర్పించింది. కాస్ట్రో ఆరో వర్ధంతిని పురస్కరించుకొని గురువారం నాడిక్కడ కాంగ్రెస్ సభ్యుడు రూబెన్ మోరీరా నేతృత్వంలోని 'పార్లమెంటరీ గ్రూప్ ఆఫ్ ఫ్రెండ్స్ ఆఫ్ క్యూబా' ఫోటో ప్రదర్శన ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేసింది.

2లో

ఖజానా కటకట!

- రెండో తేదీనా ఉద్యోగులకు అందని జీతాలు
- ఈరోజు ఇవ్వకుంటే ఇక సోమవారమే
- ఉపాధ్యాయులకు ఆపడంపై ఆగ్రహం
- ప్రతి నెలా ఆలస్యం చేస్తున్నారని పెన్షనర్ల గగ్గోలు
- అప్పుల వేటలో రాష్ట్ర ప్రభుత్వం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఖజానా డబ్బుల్లేక కటకట లాడుతోంది. ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు కూడా సక్రమంగా చెల్లించలేని దయనీయ స్థితి ఏర్పడింది. ఎన్ని విపత్తులు సంభవించినా ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రం ఒకటో తేదీన ఠంచనుగా జీతాలు అందుతా యనే భరోసా గతంలో ఉండేది. కొద్ది నెలలుగా జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితుల్లో ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ నెల జీతం చాలామంది ప్రభుత్వ ఉద్యోగులకు శుక్రవారం కూడా అకౌంట్లలో పడలేదు. ముఖ్యంగా ఉపాధ్యాయులకు రాష్ట్రవ్యాప్తంగా నిలిపివేసినట్లు తెలిసింది. పోలీస్, వ్యవసాయ, వైద్య ఆరోగ్యశాఖ, ట్రెజరీ, మండల పరిషత్ సిబ్బందికి మాత్రం ఒకటో తేదీనే జీతాలు జమయ్యాయి. ఉపాధ్యాయులకు, విద్యాశాఖలో పనిచేసే వారికి మాత్రం 2వ తేదీన కూడా జీతాలు పడలేదు. కావాలనే ప్రభుత్వం జీతాలు నిలిపివేసి ఇబ్బందులు పెడుతోందని ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీపీఎస్ రద్దు కోసం ఉపాధ్యాయులు తీవ్రస్థాయిలో పోరాడుతుండటంతో ప్రభుత్వం తమపై కక్ష గట్టిందని వారు ఆరోపిస్తున్నారు. ఎన్నికల విధుల నుంచి తమను మినహాయించడానికి కారణం కూడా ఇదేనని వారు పేర్కొంటున్నారు. తమకు ప్రతినెలా ఆలస్యమవుతోందని పెన్షనర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదవీ విరమణ తర్వాత ప్రశాంత జీవనం గడపాల్సిన తాము ప్రతి నెలా పెన్షన్ ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితిలో మానసిక ఒత్తిడికి గురయ్యే పరిస్థితులు నెలకొన్నాయని వాపోతున్నారు. సహజంగా ప్రతి నెలా 30వ తేదీ మధ్యాహ్నం లోపు సబ్ ట్రెజరీ కార్యాలయాల నుంచి జీతాల బిల్లులు అప్‌లోడ్ కావాలి. కానీ ప్రభుత్వ ఖజానాలో డబ్బుల్లేక...సీఎఫ్ఎంఎస్ సర్వర్‌ను కావాలని డెడ్ స్లో చేసి, డ్రాయింగ్ అండ్ డిస్పాన్ మెంట్ ఆఫీసర్ల నుంచి జీతాల బిల్లు అప్‌లోడ్ కాకుండా చేశారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. జీతాలు, పెన్షన్ల కోసం ప్రతి నెలా ప్రభుత్వానికి సుమారు రూ.5,500 కోట్లు అవసరం. రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తుండటంతో వివిధ శాఖల ద్వారా వచ్చే ఆదాయాన్ని సంక్షేమ పథకాల అమలుకు మళ్లిస్తోంది. దీంతో ప్రభుత్వ ఉద్యోగులు తమ జీతాల కోసం ప్రతి నెలా పడిగాపులు కాసే పరిస్థితి ఏర్పడుతోంది. ఇక రాష్ట్ర ప్రభుత్వం జీతాలు, పెన్షన్లు, నవరత్నాల అమలు కోసం అప్పుల కోసం నిత్య అన్వేషణ సాగిస్తోంది. రుణం లేకుండా రోజు గడిచే పరిస్థితి కనిపించడం లేదు. ఎక్సైజ్, మైనింగ్, వాణిజ్యం తదితర ఆదాయ ఆర్జన శాఖల ద్వారా వచ్చే ఆదాయం నవరత్నాలకు సరిపోతుండగా, జీతాలు, పెన్షన్లకు రుణాలపైనే ఆధారపడవలసి వస్తోంది. ప్రతి నెలా సగటున రూ.6,000 కోట్ల వరకు ప్రభుత్వం బహిరంగ మార్కెట్ రుణం

- మిగతా 2 లో

హైకోర్టు జడ్జిల బదిలీలు ఆపండి

గవర్నర్ విశ్వభూషణ్‌కు న్యాయవాదుల జేఏసీ వినతి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఏపీ హైకోర్టులో ఇద్దరు సీనియర్ జడ్జీలైన జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ డి. రమేశ్‌ను వేర్వేరు హైకోర్టులకు బదిలీ చేస్తూ తాజాగా సుప్రీం కోర్టు తీసుకున్న నిర్ణయంపై ఆందోళనలు కొనసాగు తున్నాయి. హైకోర్టులో విధుల్ని బహిష్కరించి అడ్వకేట్ల జేఏసీ నిరసనలు చేపడుతోంది. దీనిలో భాగంగా శుక్రవారం విజయవాడలోని రాజ్ భవన్‌లో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ను జేఏసీ నేతలు కలిసి బదిలీలు నిలిపివేయాలని కోరారు. గవర్నర్‌కు తాజా పరిస్థితుల్ని వివరించిన న్యాయవాదులు, ఈ నెల 4వ తేదీ రాష్ట్రానికి విచ్చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి ఈ విషయమై వినతిపత్రం అందజేసేందుకు అనుమతి ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. న్యాయవాదుల వినతికి గవర్నర్ నుంచి సానుకూల స్పందన వచ్చిందని జేఏసీ నేత జడ శ్రావణ్ కుమార్

- మిగతా 2 లో

ఈడీ దాడుల కలకలం

ఎన్ఆర్ఐ, అక్కినేని ఉమెన్స్ ఆసుపత్రుల్లో సోదాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులు కలకలం రేపుతున్నాయి. రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాంకు ఐటీ శాఖ నోటీసులు పంపడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశం కాగా, శుక్రవారం గుంటూరు జిల్లాలోని ఎన్ఆర్ఐ, విజయవాడలో అక్కినేని ఉమెన్స్ ఆసుపత్రుల్లో ఈడీ నిర్వహించిన సోదాలు వ్యాపారవర్గాల్లో దుమారం రేపాయి. ఇప్పటి వరకు తెలంగాణలో జరుగుతున్న ఈడీ దాడులు తాజాగా ఏపీకి విస్తరించాయి. దిల్లీ నుంచి వచ్చిన నాలుగు బృందాలు నిర్దేశిత ప్రాంతాలు..సంస్థలు..వ్యక్తుల నివాసాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించాయి. ఎటువంటి సమాచారం బయటకు రానీయటం లేదు. మంగళగిరిలోని ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో అన్నిరకాల రికార్డులను ఈడీ అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. మరో పక్క ఎన్ఆర్ఐ ఆస్పత్రి కమిటీ సభ్యుల ఇళ్లలో కూడా అధికారులు తనిఖీలు చేపట్టారు. ఎన్ఆర్ఐ ఆసుపత్రి కమిటీ సభ్యురాలు అక్కినేని మణి ఎన్ఆర్ఐ నిధులతో సొంత ఆస్పత్రికి వైద్య పరికరాలు కొన్నారనే ఆరోపణలపై ఈ సోదాలు జరుగుతున్నాయనే ప్రచారం సాగుతోంది. అమెరికాలో వైద్యురాలిగా ఉంటూ ఈ ఏడాది ఆగస్టు 21వ తేదీ విజయవాడలో అక్కినేని మణి అక్కినేని ఉమెన్స్ ఆసుపత్రిని ప్రారంభించారు. విదేశీ నిధులు అక్రమంగా దారిమళ్లింపు చేశారనే ఆరోపణల నేపథ్యంలో ఆమెను ఈడీ అధికారులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఆసుపత్రి లోపలికి ఎవరు వెళ్లకుండా సెక్యూరిటీగా సీఆర్పీఎఫ్ సిబ్బంది పహారా కాస్తుండగా, 8 మంది ఈడీ అధికారులు ఆసుపత్రిలోని అన్ని రికార్డులను పరిశీలిస్తున్నారు. ఆస్పత్రి సిబ్బంది ఫోన్లను కూడా విచారణ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గతంలో ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో ఆర్థిక అవకతవకలకు పాల్పడిన ఇద్దరు ఉద్యోగులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎన్ఆర్ఐ ఆసుపత్రి యాజమాన్యంలో కూడా తీవ్రస్థాయి విభేదాలు నెలకొన్నాయి. దీనిపై గతంలో వారు బహిరంగంగానే పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే ఈడీ సోదాలు నిర్వహిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

మనుషులుగా గుర్తించండి

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్న నేటి ప్రపంచంలోనూ 'హిజ్రా'లపై చిన్నచూపు, వివక్ష కొనసాగుతూనే ఉంది. వీరికీ ఓ మనసు ఉంటుందనీ, ఆత్మవిశ్వాసంతో బతకాలన్న ఆశ ఉంటుందని ఎవరూ గ్రహించడం లేదు. ఛీత్కారాలు మనసుని దహించి వేస్తున్నా, ఏమీ చేయలేని నిస్సహాయతతో, కష్టాలకు ఎదురీదుతూ బతుకు వెళ్లదీస్తున్నారు ట్రాన్స్‌జెండర్లు. తల్లిదండ్రులు చేరదీయకపోయినా, చుట్టుపక్కల వారు అగౌరవంగా చూసినా, తెగువతో సమాజంలో నెట్టుకొస్తున్నారు.

3 లో

వ్యయభరిత నగరాలుగా న్యూయార్క్, సింగపూర్

ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన నగరాల జాబితాలో న్యూయార్క్ సింగపూర్ తొలి స్థానంలో నిలిచాయి. 2022 సంవత్సరానికి ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన నగరాల జాబితాను ఎకనమిస్ట్ ఇంటిలిజెన్స్ యూనిట్ అనే సంస్థ విడుదల చేసింది.

2 లో

పేదలపై కక్ష సాధింపు

- 5 నుంచి విజ్ఞాపన పత్రాలు అందజేత: రామకృష్ణ
- ఒంగోలులో టిడ్కో ఇళ్లను పరిశీలించిన సీపీఐ బృందం

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు: టిడ్కో గృహాలను లబ్ధిదారులకు పంపిణీ చేయడంలో ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఒంగోలు సమీపంలోని చింతల వద్ద నిర్మించిన టిడ్కో గృహాలను సీపీఐ ప్రతినిధి బృందం శుక్రవారం పరిశీలించింది. అనంతరం రామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ టిడ్కో ఇళ్లపై జగన్ ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా ఉందని విమర్శించారు. టీడీపీ హయాంలో ఎంతవరకు పూర్తయ్యాయో...ఇప్పుడూ అలాగే ఉన్నాయని చెప్పారు. ఇళ్ల నిర్మాణంగానీ, మౌలిక సదుపాయాల కల్పనగానీ జరగలేదన్నారు. ఇప్పటికైనా టిడ్కో ఇళ్లు పూర్తి చేసి పేదలకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇంకా ఆలస్యం చేస్తే అవి కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. చాలాచోట్ల నిర్మాణం పూర్తయిన ఇళ్లు ఆలనా...పాలనా లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. పేదలకు ఇళ్లు ఇవ్వడంలో రాజకీయాలేమిటని రామకృష్ణ ప్రశ్నించారు. వేలకోట్ల ప్రజాధనంతో నిర్మించిన గృహాలను పేదలకు ఇవ్వటంలో జగన్ ప్రభుత్వం జాప్యం చేస్తోందని నిలదీశారు. టిడ్కో ఇళ్లు పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ అధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుండి 10వ తేదీ వరకు అధికారు లకు విజ్ఞాపన పత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. జగనన్న కాలనీలకు సంబంధించి ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు చాలవని, దీనివల్ల నిర్మాణాలు నిలిచిపోయాయని చెప్పారు. ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిమెంటు, ఇసుక, ఇనుము ఉచితంగా అందజేయాలన్నారు.

సీబీఐ పక్షపాతం: రామకృష్ణ

కేసుల విచారణకు సంబంధించి సీబీఐ పక్షపాతంగా వ్యవహరిస్తున్నదని రామకృష్ణ అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి బాబాయి వివేకానందరెడ్డి కేసుపై నిర్లక్ష్యం ఏమిటని ప్రశ్నించారు. ఒక్కో కేసులో ఒక్కో విధంగా పనిచేస్తోందని,దీనిని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. వివేక హత్య కేసు విచారణకు జగన్ ప్రభుత్వం కూడా సహకరించినట్లు లేదని, అందుకే దీనిని సుప్రీంకోర్టు తెలంగాణకు బదిలీ చేసిందని రామకృష్ణ చెప్పారు. ఈ కేసు పక్క రాష్ట్రానికి పంపినందున సీఎం జగన్ సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు. ఆమ్ ఆద్మీ పార్టీని ఇరుకున పెట్టేందుకు దిల్లీ లిక్కర్ స్కామ్‌ను మోదీ సర్కారు తెరపైకి తెచ్చిందని విమర్శించారు. ఆశ్చర్యమేమంటే...దేశంలో అత్యధిక రాష్ట్రాలు బీజేపీ పాలన కిందే ఉన్నాయని, సీబీఐ, ఈడీ, ఐటీలకు ఆ నాయకులు ఎవరూ కనిపించడం లేదని,

- మిగతా 2 లో

ఏకరీతి ఆరోగ్యసంరక్షణ ప్రమాణాలపై
మీ స్పందన ఏమిటి?

కేంద్రం, రాష్ట్రాలకు నాలుగు వారాల గడువిచ్చిన సుప్రీం

న్యూదిల్లీ: క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-2010లోని నిబంధనలను అనుసరించడం ద్వారా రాజ్యాంగానికి అనుగుణంగా పౌరులకు ఒకే విధమైన ఆరోగ్య సంరక్షణ కోసం ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై తమ ప్రతిస్పందనలను దాఖలు చేయాలని సుప్రీంకోర్టు శుక్రవారం కేంద్రాన్ని, రాష్ట్రాలను ఆదేశించింది. న్యాయమూర్తులు బి.ఆర్.గవాయ్, విక్రమ్ నాథ్‌లతో కూడిన ధర్మాసనం తమ సమాధానాలను దాఖలు చేయడానికి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలకు నాలుగు వారాల సమయం ఇచ్చింది. సరసమైన, నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను అందించడానికి చట్టంలోని అన్ని నిబంధనలతో పాటు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ రూల్స్-2012ని అమలు చేయడానికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ జన్ స్వాస్థ్య అభియాన్, పేషెంట్స్ రైట్స్ క్యాంపెయిన్, కె.ఎం. గోపకుమార్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. 2012 నిబంధనలకు సంబంధించి 9వ నిబంధనతో సీఈఏలోని సెక్షన్లు 11, 12లో అందించిన విధంగా కనీస ప్రమాణాలను పాటించడం, విధానాలు, సేవలకు సంబంధించిన రేట్ల ప్రదర్శన, ప్రామాణిక చికిత్స ప్రోటోకాల్‌కు అనుగుణంగా ఉండటం వంటి క్లినికల్ సంస్థల నమోదు కోసం షరతుల నోటిఫికేషన్ అమలు కోసం ఆదేశాలు కోరింది. సీఈఏలోని లోటును తగిన చట్టం ద్వారా భర్తీ చేసే వరకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రోగుల కోసం ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని రూపొందించాలని కూడా పిటిషన్‌లో కోరింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 47 ప్రకారం

- మిగతా 2 లో

ఇదీ లోకం!

బాగా చదువుకో నాయనా!

పెట్రో మంట తగ్గించరా?

- 10 నెలల కనిష్ఠానికి ముడి చమురు ధర
- అయినా ఇంధన ధరలు తగ్గించని కేంద్రం
- సామాన్యుడిని దోచేస్తున్న బీజేపీ

న్యూదిల్లీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. కాషాయ పార్టీ పాలకులు సామాన్య, మధ్యతరగతి ప్రజలను ఆర్థికంగా చితికిపోయేలా చేశారు. పెట్రో ఉత్పత్తుల మాటున ప్రజలను యధేచ్ఛగా దోచుకుంటున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు తగ్గితే దేశంలోనూ పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గుతాయి. కానీ నరేంద్ర మోదీ ప్రభుత్వం ధరలను తగ్గించకపోగా పెంచుకుంటూ పోయింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ ముడి చమురు ధర 10 నెలల కనిష్ఠానికి పడిపోయింది. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించడం లేదు. గత మార్చిలో బ్యారెల్ ముడి చమురు ధర 112.8 డాలర్లుగా ఉండగా, అది ఇప్పుడు 87.82 డాలర్లకు తగ్గింది. కానీ కేంద్ర ఆ మేరకు ఇంధన ధరలను తగ్గించకుండా లాభాలను జేబులో

- మిగతా 2 లో

ఉద్యోగాల్లేవ్...

- దేశంలో నిరుద్యోగ రేటు 8 శాతం
- పట్టణాల్లో 8.96, గ్రామీణంలో 7.55
- ఏపీలో 9.1 శాతం పెరుగుదల
- సీఎంఐఈ నివేదిక వెల్లడి



న్యూదిల్లీ: దేశంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో యువత అల్లాడుతున్నారు. ఏడాదికేడాదికి నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోతోంది. కేంద్రంలో ప్రధానిగా ఉన్న నరేంద్ర మోదీ ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పుకొస్తున్న మాటలు నీటిమూటలుగానే మిగిలాయి. ఉపాధి కల్పన దిశగా చర్యలు చేపట్టకుండా బీజేపీ పాలకులు యువతను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తూ వస్తున్నారు. ఇక అనేక రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలు ఉద్యోగ కల్పనపై ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా నిరుద్యోగం పెరిగిపోతోంది. నవంబరులో నిరుద్యోగ రేటు 8 శాతానికి పెరిగిందని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) పేర్కొంది. నివేదిక ప్రకారం... సెప్టెంబరు, అక్టోబరులో కంటే నవంబరులో నిరుద్యోగ రేటు పెరిగింది. అత్యధిక నిరుద్యోగ రేటు పట్టణాల్లో నమోదయింది. సెప్టెంబరులో 6.43 శాతం ఉన్న నిరుద్యోగ రేటు, అక్టోబరు నాటికి 7.77 శాతానికి పెరిగింది. అది కాస్తా పెరిగి నవంబరులో 8 శాతానికి చేరింది. గ్రామీణ ప్రాంతాల్లో కంటే, పట్టణాల్లోనే నిరుద్యోగం ఎక్కువగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో 7.55 శాతం నిరుద్యోగం రేటు ఉంటే, పట్టణాల్లో 8.96 శాతం నమోదయింది. నిరుద్యోగ రేటు పెరుగుదలలో హరియాణా (30.6 శాతం), రాజస్థాన్ (24.5 శాతం), జమ్ముకశ్మీర్ (23.9 శాతం) మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. ఆ తరువాత స్థానాల్లో బీహార్ (17.3 శాతం), త్రిపుర (14.5 శాతం), జార్ఖండ్ (14.3 శాతం), అసోం (14 శాతం), గోవా (13.6 శాతం), దిల్లీ (15.7 శాతం) రాష్ట్రాలు రెండంకెల నిరుద్యోగ రేటును నమోదు చేసుకున్నాయి.

తెలంగాణలో తగ్గుదల

నిరుద్యోగ రేటు ఆంధ్రప్రదేశ్‌లో పెరిగితే... తెలంగాణాలో తగ్గింది. ఆంధ్రప్రదేశ్‌లో 9.1 శాతంగా, తెలంగాణలో 6 శాతం నిరుద్యోగ రేటు

- మిగతా 2 లో

కాస్ట్రోకు మెక్సికన్ కాంగ్రెస్ ఘన నివాళి

మెక్సికోసిటీ: క్యూబా మాజీ అధ్యక్షుడు ఫిడెల్ కాస్ట్రోకు మెక్సికన్ కాంగ్రెస్ ఘనంగా నివాళులర్పించింది. కాస్ట్రో ఆరో వర్ధంతిని పురస్కరించుకొని గురువారం నాడిక్కడ కాంగ్రెస్ సభ్యుడు రూబెన్ మోరీరా నేతృత్వంలోని 'పార్లమెంటరీ గ్రూప్ ఆఫ్ ఫ్రెండ్స్ ఆఫ్ క్యూబా' ఫోటో ప్రదర్శన ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేసింది. కమాండర్-ఇన్-చీఫ్, క్యూబా విప్లవ నేతగా కాస్ట్రోకు సంబంధించి వందకు పైగా అద్భుత చిత్రాలను ప్రదర్శించారు. పార్లమెంటరీ గ్రూప్ వైస్-ప్రెసిడెంట్ యెయిడ్‌కోల్ పోలెవ్‌స్కీ... కాస్ట్రో జీవితం, అతని రాజకీయ ఆలోచనలను ఈ సందర్భంగా వివరించారు. ఫిడేల్ కాస్ట్రోతో తన సమావేశాలకు సంబంధించిన కొన్ని అంశాలను పేర్కొన్నారు. ముఖ్యంగా 2006లో కోహుయిలాకు ఫిడెల్ పర్యటనలో అతను గవర్నర్‌గా పనిచేశాడు మరియు మూడు నేత్ర వైద్యశాలలను విరాళంగా ఇచ్చాడు. క్యూబా రాయబారి మార్కోస్ రోడ్రిగ్జ్ మాట్లాడుతూ... క్యూబాపై అమెరికా విధించిన ఆర్థిక, వాణిజ్య ఆంక్షలు, ఆర్థిక దిగ్బంధనానికి ముందు మెక్సికో నేతల సంఘీభావానికి రోడ్రిగ్జ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. మానవత్వాన్ని కూడా మరిచి అమెరికా చేసిన కక్షపూరిత చర్యలను చట్టసభ సభ్యులు ఖండించారు. అలాగే ఇటీవల ఐరాస జనరల్ అసెంబ్లీలో జరిగిన ఓటింగ్‌లో క్యూబాకు మద్దతు పలికారు. క్యూబాపై ఆర్థిక దిగ్బంధనాన్ని ఎత్తివేయాలని ప్రపంచదేశాలు అమెరికాకు పిలుపునిచ్చాయి.

13వేల మంది సైనికులను కోల్పోయాం: ఉక్రెయిన్

కీవ్: రష్యాతో జరుగుతున్న యుద్ధంలో పది వేలమందికి పైగానే సైనికులను కోల్పోయామని ఉక్రెయిన్ అధికారికంగా ప్రకటించింది. యుద్ధం మొదలై దాదాపు తొమ్మిది నెలలు దాటినా ఇరు పక్షాల నుంచి మృతుల సంఖ్య పై కచ్చితమైన వివరాలు వెలువడలేదు. గత ఫిబ్రవరి నుంచి జరుగుతున్న యుద్ధంలో 13 వేల మంది ఉక్రెయిన్ సైనికులు చనిపోయారని ఆ దేశ అధ్యక్షుడి సలహాదారు మైఖైలో పొదోలియాక్ చెప్పారు. తాజాగా ఆయన ఓ టీవీ కార్యక్రమంలో మాట్లాడుతూ... ఉక్రెయిన్ మృతుల సంఖ్యను పారదర్శకంగా చెబుతుందని పేర్కొన్నారు. మా కమాండర్ ఇన్ చీఫ్ అధికారికంగా మూల్యాంకనం చేస్తారు...వారి లెక్క ప్రకారం మృతుల సంఖ్య 10,000-13,000 మధ్యలో ఉందని పేర్కొన్నారు. ఇంచుమించుగా అంతే సంఖ్యలో సైనికులు గాయపడ్డారని కూడా తెలిపారు. అయితే ఆగస్టు చివరివారంలో తొమ్మిది వేల మంది సైనికులను కోల్పోయామని ఉక్రెయిన్ సైనిక బలగాలు వెల్లడించడం గమనార్హం. కాగా మరణాల విషయంలో తాము ఏమీ దాచడం లేదని పొదోలియాక్ స్పష్టం చేశారు. కాగా, ఉక్రెయిన్‌లో సుమారు లక్ష మంది దాకా సైనికులను రష్యా కోల్పోయిందని, అంతే సంఖ్యలో జవాన్లు గాయపడ్డారని అమెరికా ఆర్మీ ఉన్నతాధికారులు వెల్లడించారు. ఉక్రెయిన్ కూడా భారీగా సైనికులను కోల్పోయిందని అంచనా వేశారు. అయితే ఐరోపా కమిషన్ అధిపతి ఉర్సులా వొన్డెర్ లెయెన్ బుధవారం మాట్లాడుతూ లక్ష మంది వరకు ఉక్రెయిన్ సైనికులు మరణించారని వెల్లడించారు. దాదాపు 20,000 మంది పౌరులు కూడా ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. కానీ, ఆ తర్వాత ఆమె ప్రతినిధి విలేకర్లతో మాట్లాడుతూ అది పొరబాటున చెప్పిన అంకె అని సవరించారు. ఇరువైపుల మొత్తం లక్ష మంది మరణించారని చెప్పారు.

జెలెన్‌స్కీని కలిసిన బేర్‌గ్రిల్స్...

బ్రిటన్‌కు చెందిన ప్రముఖ టీవీ ప్రెజెంటర్ బేర్ గ్రిల్స్ ఉక్రెయిన్‌కు వెళ్లి ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. ఈ విషయాన్ని బేర్ గ్రిల్స్ ఇన్‌స్టాలో వెల్లడించారు. 'ఈ వారం నేను ఉక్రెయిన్‌లోని కీవ్‌కు వెళ్లి అధ్యక్షుడు జెలెన్‌స్కీని కలిశాను. ఓ పక్క ఎముకలు కొరికే చలి.. మరో పక్క మౌలిక వసతులపై దాడులు జరుగుతున్న సమయంలో లక్షల మంది ప్రజలు ప్రాణాలు కాపాడుకోవడం రోజువారీ పోరాటమే. ప్రస్తుతం ప్రపంచం ఇప్పటి వరకు చూడని జెలెన్‌స్కీని చూస్తోంది' అని గ్రిల్స్ పేర్కొన్నారు.

భారత్‌కు రికార్డు రెమిటెన్సులు

2022లో 100 బిలియన్ డాలర్లు: ప్రపంచ బ్యాంకు అంచనా

వాషింగ్టన్: ప్రపంచంలోనే అత్యధిక రెమిటెన్సులు పొందే దేశంగా భారత్ తన స్థానాన్ని పదిలం చేసుకుంది. విదేశాలకు వెళ్లిన వలస కార్మికులు స్వదేశానికి పంపే మొత్తం (రెమిటెన్స్) ఈ ఏడాదిలో 100 బిలియన్ డాలర్ల రికార్డును దాటుతుందని ప్రపంచ బ్యాంకు 'మైగ్రేషన్- డెవలప్‌మెంట్ బ్రీఫ్' నివేదిక పేర్కొంది. రెమిటెన్సుల్లో 12శాతం పెంపుదల ఉన్నట్లు తెలిపింది. ఈ ఏడాది రెమిటెన్సుల విలువ 12 శాతం పెరిగి 100 బిలియన్ డాలర్లకు చేరుతుందని నివేదికలో పేర్కొంది. చైనా, మెక్సికో, ఫిలిప్పీన్స్ దేశాల కంటే భారత్‌కే ఎక్కువగా రెమిటెన్సులు వస్తుంటాయని తెలిపింది. అమెరికా, బ్రిటన్, సింగపూర్‌లో ఉన్న నిపుణులైన కార్మికులు/ఉద్యోగులు ఈ ఏడాది భారీగా నిధులు భారత్‌కు పంపుతున్నారని పేర్కొంది. గల్ఫ్ దేశాల నుంచి భారతీయ ప్రవాసులు అమెరికా, బ్రిటన్, సింగపూర్ వంటి దేశాలకు వలస వెళ్లిపోతున్నారని, వేతనాల పెంపు, రూపాయి బలహీనత కూడా రికార్డు స్థాయి రెమిటెన్సులకు కారణమని వెల్లడించింది. లాటిన్ అమెరికా, కరేబియన్‌కు వచ్చే రెమిటెన్సులు 9.3శాతంగా ఉంటే దక్షిణాసియాకు 3.5శాతం, మధ్యతూర్పు, ఉత్తర ఆఫ్రికాకు 2.5శాతం చొప్పున, తూర్పు ఆసియా, పసిఫిక్‌కు 0.7శాతం చొప్పున ఉన్నట్లు వెల్లడించింది. తొలిసారిగా 100 బిలియన్ డాలర్ల వార్షిక రెమిటెన్సులు పొందిన ఏకైక దేశంగా భారత్ నిలుస్తుందని ప్రపంచ బ్యాంకు నివేదిక పేర్కొంది. ఒక్క భారత్‌లోనే కాదు దక్షిణాసియా రెమిటెన్సులు 3.5శాతం పెరిగి 163 బిలియన్ డాలర్లకు చేరే అంచనా ఉన్నట్లు తెలిపింది.నేపాల్‌కు సంబంధించి 4శాతం పెంపు ఉన్నట్లు వెల్లడించింది.

కూర్చున్న చోటే మృతువు

న్యూఢిల్లీ: 'టైం బాగోపోవడమంటే ఇదేనేమో....' గాలి కోసం కిటికీ దగ్గర కూర్చున్న వ్యక్తికి అదే తన జీవితంలో ఆఖరి రోజైంది. ఏం జరిగిందో తెలుసుకునేలోపు ఆ వ్యక్తి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. మృత్యువు ఏ రూపంలో వస్తుందో చెప్పలేమనడానికి ఈ ఘటనే నిదర్శనం. అప్పటి వరకు స్నేహితులు, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపిన వ్యక్తి అప్పుడే రైలెక్కాడు. గాలి చక్కగా తగులుతుందనేమో..విండో సీట్‌లో కూర్చున్నాడు. అదే అతడి పాలిట మృత్యుపీఠమైంది. రైలు వేగంగా వెళ్తుండగా.. అనుకోకుండా ఓ ఇనుప చువ్వ కిటికీ అద్దాలను పగులగొట్టుకుంటూ వ్యక్తి మెడలో చొచ్చుకుపోయింది. ఏమైందో అక్కడున్న వారికి తెలిసేలోగానే అతడి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. ఒళ్లు గగుర్పొడిచే ఈ ఘటన దిల్లీలో శుక్రవారం చోటు చేసుకుంది. హరికేశ్ దుబే అనే వ్యక్తి దిల్లీ నుంచి కాన్పూర్ వెళ్లే నిలనాచల్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. ప్రయాగ్‌రాజ్ డివిజన్ పరిధిలోని దన్వర్-సోమ్నా స్టేషన్ల మధ్యలో ఒక ఇనుప చువ్వ హఠాత్తుగా బోగీలోకి దూసుకొచ్చి.. హరికేశ్ మెడలోకి చొచ్చుకుపోయింది. క్షణాల్లోనే అతడు ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న రైల్వే సిబ్బంది అలిగఢ్ జంక్షన్‌లో రైలును ఆపి.. మృతదేహాన్ని రైల్వే పోలీసులకు అప్పగించారు. ప్రమాద ఘటనపై దర్యాప్తు చేస్తున్న భారతీయ రైల్వే వెల్లడించింది. కొన్ని చోట్ల ట్రాక్‌ను సరిచేసేందుకు ఉపయోగించే ఇనుపకడ్డీ బోగీలోకి దూసుకొచ్చిందని రైల్వే అధికారులు తెలిపారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పెట్రో మంట తగ్గించరా?

(మొదటిపేజీ తరువాయి)

వేసుకుంటున్నది. ధరల తగ్గింపు ప్రయోజనం సామాన్యుడికి దక్కనీయకుండా చేస్తున్నది. ముడి చమురుకు అనుగుణంగా ఇంధన ధరలు సవరిస్తే కనీసం రూ.10 వరకూ ధర తగ్గే అవకాశం ఉన్నదని ప్రతిపక్షాలు చెబుతున్నాయి. 2015-17 మధ్య ముడి చమురు ధరలు 45-47 డాలర్ల మధ్యనే ఉన్నాయి. ఈ సమయంలో కేంద్రం ఎక్సైజ్ డ్యూటీని పెట్రోల్‌పై 22.9 శాతం, డీజిల్‌పై 68.47 శాతం పెంచింది. ఈ పన్నులు పెంచకుంటే పెట్రోల్, డీజిల్ రూ.50-55 లోపే లభించేది. 2019-2లో ముడి చమురు ధర 60.47 డాలర్లుగా ఉండగా... 2020-21లో 44.82 డాలర్లకు పడిపోయింది. కరోనా వల్ల డిమాండ్ తగ్గడంతో ఈ పరిస్థితి వచ్చింది. అయితే కేంద్రం ఆ మేరకు ధరలు తగ్గించకపోగా పెంచుకుంటూ పోయింది. 2020 మార్చి 30న పెట్రోల్ పై ఎక్సైజ్ డ్యూటీ రూ.19.98గా ఉండగా, 2021 ఫిబ్రవరి నాటికి రూ.32.90కి పెంచింది. డీజిల్ పై ఎక్సైజ్ డ్యూటీని రూ.15.83 నుంచి 31.80కి పెంచింది.

ఉద్యోగాల్లేవ్...

(మొదటిపేజీ తరువాయి)

నమోదయింది. ఏపీలో ఎనిమిది నెలల గరిష్టానికి నిరుద్యోగ రేటు చేరుకుంది. 2022 మార్చిలో 9.2 శాతం నిరుద్యోగ రేటు నమోదు కాగా, ఆ తరువాత నెలల్లో అంతకంటే తక్కువే నమోదయింది. సెప్టెంబరులో 4.8 శాతం, అక్టోబరులో 5.3 శాతం నిరుద్యోగ రేటు నమోదు కాగా, నవంబరులో నిరుద్యోగ రేటు 9.1 శాతానికి పెరిగింది. తెలంగాణలో మాత్రం నిరుద్యోగ రేటు తగ్గింది. సెప్టెంబరులో 8.3 శాతం, అక్టోబరులో 8.8 శాతం నిరుద్యోగ రేటు నమోదు కాగా, నవంబరులో 6 శాతానికి తగ్గింది. ఆర్థిక మాంద్యం, ద్రవ్యోల్బణం పెరుగుదల భయాల నేపథ్యంలో నిరుద్యోగిత రేటు పెరుగడం కలవరపరుస్తున్నది.

మీ స్పందన ఏమిటి?

(మొదటిపేజీ తరువాయి)

పౌరులకు ఆరోగ్య సంరక్షణను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొందిబీ అయినప్పటికీ, ప్రజా ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ ఊహించినట్లుగా కొనసాగలేదు. 30 శాతం మంది రోగులకు మాత్రమే చికిత్స చేస్తుంది. మిగిలిన వారికి ప్రైవేట్ రంగం ద్వారా చికిత్స జరుగుతుంది. ప్రజారోగ్య సంరక్షణ వ్యవస్థ ప్రజారోగ్య మౌలిక సదుపాయాలు, మానవ వనరుల కొరత, మందులు అందుబాటులో లేకపోవడం, ప్రభుత్వ పెట్టుబడి లేకపోవడం, ప్రైవేట్ రంగంపై బలవంతంగా ఆధారపడటం వంటి కారణాలతో బాధపడుతుందని పిటిషన్ వాదించింది. సాధారణ సమయాల్లోనే కాకుండా కోవిడ్-19 వంటి అత్యవసర సమయాల్లో కూడా పబ్లిక్ డొమైన్‌లో గరిష్ఠ సౌకర్యాలు ఉండేలా సరైన మౌలిక సదుపాయాలు, తగినంత బడ్జెట్‌ను అందించడం ద్వారా భారతదేశంలో ప్రజారోగ్య సంరక్షణ వ్యవస్థను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అభ్యర్థన సమర్పించింది.

హైకోర్టు జడ్జిల బదిలీలు ఆపండి

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. న్యాయవ్యవస్థ ఎలాంటి ప్రభావానికి గురి కాకుండా స్వేచ్ఛగా పనిచేసే పరిస్థితులు కల్పించాలని గవర్నర్‌ను కోరినట్లు చెప్పారు. జడ్జిలు బట్టు దేవానంద్, డి.రమేశ్ బదిలీలు సాధారణ బదిలీల్లో భాగంగా జరిగినవి కావని గవర్నర్‌కు వివరించినట్లు తెలిపారు. న్యాయవ్యవస్థలో ఉన్న న్యాయమూర్తులు న్యాయం చేయాలంటే న్యాయవాదుల సహకారం ఉండాలని, న్యాయ వ్యవస్థ అంటే న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు కూడా అని ఆయన తెలిపారు. న్యాయమూర్తులను కొలీజియం సిఫార్సు మేరకు బదిలీ చేయడం సరికాదన్నారు. దీనిపై ఫిర్యాదు తీసుకున్న గవర్నర్ రాష్ట్రపతితో మాట్లాడతానని హామీ ఇచ్చారని శ్రావణ్ కుమార్ తెలిపారు.

పేదలపై కక్ష సాధింపు

(మొదటిపేజీ తరువాయి)

కేవలం ప్రతిపక్ష పార్టీలే లక్ష్యంగా మారాయని ఆయన అన్నారు. రామకృష్ణ వెంట సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీశ్, జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రావు, ఒంగోలు నగర కార్యదర్శి పీవీఆర్ చౌదరి, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు విజయ, ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రామకృష్ణ, సీపీఐ నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు తదితరులు ఉన్నారు.

957 స్టాఫ్ నర్సు ఖాళీల భర్తీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం మరో ఉద్యోగ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే ఈ పోస్టులన్నీ కాంట్రాక్టు పద్ధతిలో నియమించనున్నారు. వైద్య ఆరోగ్యశాఖలో 957 స్టాఫ్ నర్సు పోస్టుల్ని భర్తీ చేయబోతున్నారు. దీనికి సంబంధించి వైద్య, ఆరోగ్యశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. వైద్య ఆరోగ్య శాఖలో ఏ ఒక్క పోస్టూ ఖాళీగా ఉండకూడదన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు ప్రకటించారు. హెల్త్ డైరెక్టర్, ఏపీ వైద్య, విధాన పరిషత్ పరిధిలో ఏడాది కాల పరిమితికిగాను కాంట్రాక్టు పద్ధతిలో మొత్తం 957 స్టాఫ్ నర్స్ పోస్టుల భర్తీ ఉంటుందని నోటిఫికేషన్‌లో వెల్లడించారు. వైద్య ఆరోగ్యశాఖ వెబ్‌సైట్‌లో ఈనెల 2 నుంచి 8 వరకు అప్లికేషన్ అందుబాటులో ఉంచుతున్నారు. ఈ వెబ్‌సైట్ నుండి అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పూర్తి చేసిన అప్లికేషన్లను డిసెంబర్ 9లోగా అయా రీజనల్ డైరెక్టర్ కార్యాలయాల్లో అందజేయాల్సి ఉంటుంది. రీజనల్ డైరెక్టర్ కార్యాలయాల అడ్రస్‌లను కూడా వైద్యారోగ్యశాఖ ప్రకటించింది. రీజనల్ డైరెక్టర్, బుల్లయ్య కాలేజీ ఎదురుగా విశాఖపట్నం ఆర్డీ కార్యాలయం, జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో రాజమండ్రి ఆర్డీ కార్యాలయం, పాత ఇటుకుల బట్టీ రోడ్, అశ్విని ఆసుపత్రి వెనుక, గుంటూరు ఆర్డీ కార్యాలయం, పాత రిమ్స్ ప్రాంగణంలో వైఎస్సార్ కడప ఆర్డీ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. జోన్ల వారీగా ఖాళీల వివరాల కోసం వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

ఇస్రో గూఢచర్యం కేసు...

నలుగురి ముందస్తు బెయిల్ రద్దు

న్యూదిల్లీ: ఇస్రో శాస్త్రవేత్త నంబి నారాయణ్ కేసులో భారత అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం కీలక తీర్పు వెలువరించింది. మాజీ డీజీపీతో సహా నలుగురు నిందితులకు కేరళ హైకోర్టు మంజూరు చేసిన ముందస్తు బెయిల్ తీర్పును కొట్టివేసింది. తిరిగి కేసును కేరళ హైకోర్టుకే బదిలీ చేస్తూ.. నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. 1994లో క్రయోజనిక్ ఇంజిన్ తయారీకి సంబంధించిన కీలక పత్రాలను శాస్త్రవేత్త నంబి నారాయణ్ విదేశీయులకు అప్పగించారంటూ కేరళ పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం న్యాయస్థానం ఈ కేసును కొట్టివేసింది. క్రయోజనిక్ ఇంజిన్ పనులు ఆలస్యం కావాలన్న విదేశీ కుట్రలో భాగంగానే కేరళ పోలీసులు నంబి నారాయణ్‌పై ఈ ఆరోపణలు చేశారంటూ సీబీఐ కేసు నమోదు చేసింది. అప్పటి పోలీసు అధికారులైన గుజరాత్ మాజీ డీజీపీ ఆర్బీ శ్రీకుమార్, విశ్రాంత నిఘా అధికారి పి.ఎస్.జయ్‌ప్రకాశ్, ఇద్దరు పోలీసు అధికారులు ఎస్.విజయన్, థంపి ఎస్ దుర్గా దత్‌పై కేసులు పెట్టింది. అయితే వారికి కేరళ హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. దీంతో హైకోర్టు తీర్పుపై సీబీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. నంబి నారాయణ్‌పై కేసు పెట్టడం ద్వారా క్రయోజనిక్ ప్రాజెక్టు పనులు ఆగిపోయాయని, రోదసీ కార్యక్రమాలు ఒకటి, రెండు దశాబ్దాల పాటు వెనకబడ్డాయని సీబీఐ వాదించింది. ఇది చాలా తీవ్రమైన అంశమని, విదేశీ కుట్రలో భాగమై పోలీసులు ఇలా చేసి ఉండవచ్చని తెలిపింది. నిందితులకు బెయిల్ ఇస్తే.. విచారణకు ఆటంకం కలుగుతుందని పేర్కొంది. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ ఎం.ఆర్. షా, జస్టిస్ సి.టి. రవికుమార్ ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది. "సీబీఐ అప్పీళ్లను అంగీకరిస్తున్నాం. ఈ కేసులో నిందితులకు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేస్తున్నాం. ఈ కేసుకు సంబంధించిన అన్ని పిటీషన్లను తిరిగి హైకోర్టుకే పంపిస్తున్నాం. నిందితుల బెయిల్ దరఖాస్తులను మళ్లీ మొదటి నుంచి విచారించండి. నాలుగు వారాల్లోగా దీనిపై తీర్పు వెలువరించండి" అని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. అయితే ముందస్తు బెయిల్ దరఖాస్తులపై కోర్టు తీర్పు వెలువరించేదాకా నిందితులను అరెస్టు చేయకుండా వారికి రక్షణ కల్పించింది.

అమెరికాలో చిక్కిన

మూసేవాలా హంతకుడు

న్యూదిల్లీ: పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్య కేసులో ప్రధాన సూత్రధారి, గ్యాంగ్‌స్టర్ గోల్డీ బ్రార్ అమెరికాలో చిక్కినట్లు తెలుస్తోంది. నవంబరు 20నే అతడిని కాలిఫోర్నియాలో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ పరిణామాల గురించి భారత నిఘా సంస్థ 'రా', దిల్లీ పోలీసు నిఘా విభాగానికి సమాచారం అందినట్లు తెలుస్తోంది. అయితే దీనిపై కాలిఫోర్నియా ప్రభుత్వం నుంచి భారత ప్రభుత్వానికి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన సతీందర్‌జీత్ సింగ్ అలియాస్ గోల్డీ బ్రార్ 2017 నుంచి కెనడాలో ఉంటున్నాడు. ఇటీవల అమెరికాకు మకాం మార్చినట్లు సమాచారం. ఈ ఏడాది మే 29న సిద్ధూ మూసేవాలాను కొందరు దుండగులు పంజాబ్‌లోని మాన్సా జిల్లాలో కాల్చి చంపిన విషయం తెలిసిందే. ఈ హత్యకు గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ కుట్ర పన్నినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ హత్యను కెనడా నుంచి గోల్డీ బ్రార్ పర్యవేక్షించాడు. ఈ హత్యకు పాల్పడిన హంతకులకు బ్రార్ నుంచి కచ్చితమైన సమాచారం, ఆదేశాలు అందినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. హత్యకు ఒక రోజు ముందు హంతకుల్లో ప్రధాన షూటర్ అయిన ప్రియవ్రత్ ఫౌజీతో గోల్డీ బ్రార్ ఫోన్‌లో మాట్లాడాడని దర్యాప్తులో తేలింది. సిద్ధూతో తమకు వైరం ఉందని, అందుకే అతడిని చంపేసినట్లు తిహార్ జైలులో ఉన్న బిష్ణోయ్ పోలీసుల ఎదుట అంగీకరించినట్లు సమాచారం. మే 29 సాయంత్రం సిద్ధూ తన స్నేహితులతో కలిసి మాన్సా జిల్లాలోని స్వగ్రామానికి వెళ్తుండగా.. మార్గమధ్యలో గుర్తుతెలియని వ్యక్తులు అతడిపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సిద్ధూను ఆసుపత్రికి తరలించేలోపే మృతిచెందాడు. అయితే ఈ హత్యను గోల్డీ బ్రార్ పక్కాగా అమలు చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. సిద్ధూ తన ఇంటి నుంచి ఎలాంటి సెక్యూరిటీ లేకుండా బయటకు వెళ్లినట్లు బ్రార్‌కు సమాచారం అందింది. వెంటనే అతడు షూటర్లకు సమాచారం ఇచ్చాడు. దీంతో హంతకుల బృందం రెండు కార్లలో సిద్ధూ వాహనాన్ని వెంబడించింది. అదను చూసి వారు కాల్పులు జరిపారు. హత్య అనంతరం గోల్డీ బ్రార్ మరోసారి హంతకులకు ఫోన్ చేసి.. హరియాణాలోని ఫరీదాబాద్‌లో దాక్కోవాలని సూచించాడు. మే 31 నాటికి భీవని జిల్లాకు చేరుకొన్న హంతకులు ఆ తర్వాత జూన్ 2 నాటికి గుజరాత్‌లోని ముంద్రాకు వెళ్లిపోయారు. ఈ విషయాలు మొత్తం గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సోదరులు అనుమోల్, కజిన్ సచిన్ పోలీసులకు వెల్లడించారు.

వ్యయభరిత నగరాలుగా

న్యూయార్క్, సింగపూర్

న్యూయార్క్: ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన నగరాల జాబితాలో న్యూయార్క్ సింగపూర్ తొలి స్థానంలో నిలిచాయి. 2022 సంవత్సరానికి ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన నగరాల జాబితాను ఎకనమిస్ట్ ఇంటిలిజెన్స్ యూనిట్ అనే సంస్థ విడుదల చేసింది. వరల్డ్‌వైడ్ కాస్ట్ ఆఫ్ లివింగ్ రిపోర్ట్ ఆధారంగా రూపొందించిన ఈ జాబితా ప్రకారం ప్రపంచంలోనే 172 ప్రధాన నగరాల్లో జీవన వ్యయం గత ఏడాదితో పోలిస్తే సగటున 8.1 శాతం పెరిగింది. గత ఏడాది విడుదలైన అత్యంత ఖరీదైన నగరాల జాబితాలో తొలి స్థానంలో నిలిచిన ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ నగరం ఈసారి మూడో స్థానానికి పడిపోయింది. ఇక హాంగ్‌కాంగ్, లాస్‌ఏంజెల్స్ 4, 5 స్థానాల్లో నిలిచాయి. స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్ ఆరో స్థానం, జెనీవా (స్విట్జర్లాండ్) ఏడో స్థానం, శాన్‌ఫ్రాన్సిస్కో (అమెరికా) ఎనిమిదో స్థానం, ప్యారిస్ (ఫ్రాన్స్) తొమ్మిదో స్థానం, డెన్మార్క్‌లోని కోపెన్‌హ్యాగెన్, ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరం పదో స్థానంలో నిలిచాయి. కాగా, సిరియా రాజధాని డమాస్కస్, లిబియాలోని ట్రిపోలి ప్రపంచంలోనే అత్యంత తక్కువ జీవన వ్యయం ఉన్న నగరాలుగా నిలిచాయి. రష్యా రాజధాని మాస్కో, ఆస్ట్రేలియా నగరం సెయింట్ పీటర్స్‌బర్గ్‌ల ర్యాంకింగ్‌లో అతిపెద్ద మార్పు జరిగింది. విపరీతమైన ద్రవ్యోల్బణం పరంగా, రెండింటి ర్యాంకింగ్‌లు వరుసగా 88, 70 స్థానాల్లో నిలిచాయి.

మాస్కో ర్యాంకింగ్‌లో భారీ మార్పు

రష్యా-ఉక్రెయిన్ ల యుద్ధం, కోవిడ్ వల్ల రష్యా రాజధాని మాస్కో ర్యాంకింగ్ పడిపోయింది. గత ఏడాది ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉన్న టెల్ వీవ్ మూడో స్థానానికి పడిపోగా, అలాగే.. హాంకాంగ్, లాస్ ఏంజెల్స్ ల ర్యాంకులు కూడా తమ నగరాల్లో టాప్-5 ర్యాంకుల్లోకి చేరుకున్నాయి. ప్రభుత్వ విధానాలు, కరెన్సీ పతనం కారణంగా దేశ వ్యక్తిగత పనితీరులో కూడా మార్పు వచ్చింది. రష్యా రాజధాని మాస్కో, ఆస్ట్రేలియా నగరం సెయింట్ పీటర్స్‌బర్గ్‌ల ర్యాంకింగ్‌లో అతిపెద్ద మార్పు జరిగింది. విపరీతమైన ద్రవ్యోల్బణం పరంగా, రెండింటి ర్యాంకింగ్‌లు వరుసగా 88,70 స్థానాల్లో నిలిచాయి.

టాప్ 100లో భారతీయ నగరం ఏదీ లేదు

172 నగరాల జాబితాలో మూడు భారతీయ నగరాలు (చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్) చేర్చబడినప్పటికీ.. భారతదేశంలోని ఏ నగరం కూడా టాప్ 100లో లేవు. పెరుగుదలను నివారించే ధోరణి కారణంగా ఆసియా నగరాల్లో జీవన వ్యయం సగటున కేవలం 4.5% మాత్రమే పెరిగిందని నివేదిక పేర్కొంది. ప్రభుత్వ విధానాలు, కరెన్సీ కదలికల కారణంగా పనితీరు దేశం నుండి దేశానికి మారుతూ ఉంటుంది.

చైనాలో కరోనా కేసుల ఉధృతి

బీజింగ్: చైనాలో కరోనా వ్యాప్తి కొనసాగుతోంది. గత వారం రోజులుగా రోజువారీ కేసులు 30 వేలకుపైగా నమోదవుతున్నాయి. తాజాగా 34,980 కేసులు కొత్తగా రికార్డయ్యాయి. ఇందులో 4,278 మంది కరోనా లక్షణాలు ఉన్నవారు కాగా, మరో 30,702 మందికి ఎలాంటి లక్షణాలు లేవని నేషనల్ హెల్త్ కమిషన్ తెలిపింది. కొత్తగా ఎవరూ మరణించలేదని, ఇప్పటివరకు కరోనా వల్ల 5233 మంది మృతిచెందారని వెల్లడించింది. గురువారం 36,061 కేసులు నమోదైన విషయం తెలిసిందే. కరోనా కేసులు పెరగడంతో బీజింగ్, షాంఘై, గువాంగ్జౌ, చాంగక్వింగ్ వంటి ప్రధాన నగరాల్లో కఠిన ఆంక్షలు కొనసాగుతున్న సంగతి విదితమే. అయితే కరోనా బాధితుల సంఖ్య క్రమంగా తగ్గుతుండంతో ఆంక్షలను సడలించాని అధికారులు భావిస్తున్నారు. త్వరలోనే కరోనా నిబంధనలను సడలించనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

ఖజానా కటకట!

(మొదటిపేజీ తరువాయి)

తీసుకుంటోంది. నవంబరులో ఆ పరిమితిని దాటేసింది. కేంద్ర ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం ప్రతి రాష్ట్రం తన స్థూల ఉత్పత్తిలో 4 శాతం మేర ఆ ఏడాది రుణాలు తీసుకునేందుకు కేంద్రం అనుమతిస్తుంది. ఏ రూపంలో రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకునే రుణమైనా ఆ పరిమితికి లోబడి ఉండాలి. డిసెంబరు నెలాఖరు వరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.43,803 కోట్ల రుణం తీసుకునేందుకు కేంద్రం అనుమతిచ్చింది. ఆ పరిమితి నవంబరు1తోనే తీరిపోయింది. అదే రోజున రెండు విడతలుగా రూ. 700 కోట్లు, రూ.713 కోట్లు వివిధ కాలపరిమితుల్లో రిజర్వుబ్యాంకు నిర్వహించే సెక్యూరిటీల వేలం ద్వారా రాష్ట్రం రుణం తీసుకుంది. తర్వాత మూడు వారాల పాటు అక్కడ రుణం సమీకరించే పరిస్థితులు లేకుండా పోయింది. ఏ నెలలో ఏ తేదీ నాటికి ఎంత రుణం అవసరమవుతుందో రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరులో రిజర్వు బ్యాంకుకు తెలియజేసింది. ఆ ప్రకారం అక్టోబరు 3 నుంచి డిసెంబరు నెలాఖరు వరకు రూ.10,000 కోట్లు అవసరం. అక్టోబరు 3న రూ. 2,000 కోట్లు, నవంబరు 1న రూ. 2,000 కోట్లు, నవంబరు 7న రూ. 1,000 కోట్లు, నవంబరు 29న 2,000 కోట్లు అవసరమని పేర్కొంది. డిసెంబరులో 6, 13, 20 తేదీల్లో రూ. 3,000 కోట్లు అవసరమని సమాచారం ఇచ్చింది. నవంబరు 1న రూ.1,413 కోట్లు తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి రుణ పరిమితి దాటిపోయి, అదనంగా అప్పు లభించే అవకాశం లేకపోవడం వల్లే జీతాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

జాత్యాహంకారాన్ని

దీటుగా ఎదుర్కోవాలి: సునాక్

లండన్: 'జాత్యాహంకారాన్ని ఎదుర్కోవడంలో దేశం ఎంతో పురోగతి సాధించింది. మనకు అటువంటి సందర్భం ఎప్పుడు కనిపించినా, దాన్ని దీటుగా ఎదుర్కోవాలి' అని బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ పేర్కొన్నారు. జాత్యాహంకార ఆరోపణలకు బ్రిటన్ రాజభవనం మరోసారి వేదికైంది. ఓ నల్లజాతి సంతతికి చెందిన మహిళపై రాజభవనంలోని సీనియర్ సిబ్బంది జాతి వివక్ష చూపించారన్నది వివాదం. దీంతో వివాదానికి కారణమైన ప్యాలెస్ సిబ్బంది ఆ బాధ్యతల నుంచి వైదొలిగారు. తాజాగా వీటిపై బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ స్పందించారు. ఈ వివాదంపై తాను వ్యాఖ్యానించడం సరైంది కాదన్న ఆయన.. తన జీవితంలోనూ జాత్యాహంకారాన్ని ఎదుర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. కానీ, నేడు అలాంటివి జరుగుతాయని తాను నమ్మడం లేదన్నారు. అలాంటివి ఎప్పుడు కనిపించినా దీటుగా ఎదుర్కోవాలన్నారు. బ్రిటన్ రాజభవనం నివాసముండే బకింగ్‌హామ్ ప్యాలెస్‌లో ఇటీవల ఈ జాతి వివక్ష ఆరోపణలు వచ్చాయి. బ్రిటిష్ ఛారిటీకి చెందిన మహిళను (నగోజీ ఫులాని) ఏ దేశానికి చెందిన వారు, ఎక్కడి నుంచి వచ్చావ్ అనే విషయాలు తెలుసుకునేందుకు ప్రిన్స్ విలియమ్ గాడ్‌మదర్ సుసాన్ హుస్సే పదే పదే ప్రయత్నించారన్నది ఆరోపణ. అలా విచారించడం తనకెంతో అవమానంగా అనిపించిందని ఫులాని వెల్లడించడంతో వివాదం బయటకు వచ్చింది. దీంతో ప్యాలెస్ బాధ్యతల నుంచి వైదొలిగిన సుసాన్ హుస్సే.. ఆ ఘటనపై క్షమాపణలు చెప్పారు.

యూపీఐ లావాదేవీల పరిమితిపై

2024 వరకు గడువు

ఫోన్‌పే, గూగుల్‌పేకు ఊరట

న్యూదిల్లీ: యూపీఐ లావాదేవీల్లో గూగుల్‌కు చెందిన గూగుల్‌పే, వాల్‌మార్ట్ చెందిన ఫోన్‌పేదే హవా. దేశంలో జరుగుతున్న లావాదేవీల్లో ఈ రెండింటి వాటానే అధికం. ఈ వ్యవస్థలో గుత్తాధిపత్యాన్ని నిరోధించేందుకు 30 శాతం పరిమితి నిబంధనను తీసుకొచ్చిన నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ (ఎన్‌పీసీఐ) దాని అమలు గడువును 2024 డిసెంబర్‌కు వాయిదా వేసింది. దీంతో ఆ రెండు కంపెనీలకు ఊరట లభించినట్లయ్యింది. మొత్తం యూపీఐ లావాదేవీల్లో గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం వంటి థర్డ్ పార్టీ యాప్ ప్రొవైడర్లులు ఏవీ 30 శాతానికి మించి వాటా ఉండకూడదని ఎన్‌పీసీఐ 2020లో నిర్ణయించింది. ఈ నిబంధన 2021 జనవరి 1 నుంచి అమల్లోకి వస్తుందని ప్రకటించింది. దశలవారీగా దీన్ని అమలు చేసేందుకు ఆయా యాప్ ప్రొవైడర్లకు రెండేళ్ల గడువు ఇచ్చింది. తాజాగా గడువును మరో రెండేళ్లపాటు పొడిగించింది. అదే సమయంలో డిజిటల్ పేమెంట్లలో గణనీయమైన వృద్ధికి అవకాశం ఉన్న వేళ కొత్త ప్లేయర్లు ప్రజలకు చేరువయ్యే మార్గాలను అన్వేషించాలని ఎన్‌పీసీఐ సూచించింది.

మనుషులుగా గుర్తించండి

- వివక్ష విడనాడండి...శాపం కాదు... జన్యులోపం
- కష్టించి పనిచేయలేం... భిక్షాటనే దిక్కు
- విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించండి
- వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలంటూ ట్రాన్స్‌జెండర్‌ల వినతి

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్న నేటి ప్రపంచంలోనూ 'హిజ్రా'లపై చిన్నచూపు, వివక్ష కొనసాగుతూనే ఉంది. వీరికీ ఓ మనసు ఉంటుందనీ, ఆత్మవిశ్వాసంతో బతకాలన్న ఆశ ఉంటుందని ఎవరూ గ్రహించడం లేదు. ఛీత్కారాలు మనసుని దహించి వేస్తున్నా, ఏమీ చేయలేని నిస్సహాయతతో, కష్టాలకు ఎదురీదుతూ బతుకు వెళ్లదీస్తున్నారు ట్రాన్స్‌జెండర్లు. తల్లిదండ్రులు చేరదీయకపోయినా, చుట్టుపక్కల వారు అగౌరవంగా చూసినా, తెగువతో సమాజంలో నెట్టుకొస్తున్నారు.

వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

మాలో చదువుకున్న వారూ ఉన్నారు. ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పించి ఉద్యోగాలివ్వాలి. ట్రాన్స్‌జెండర్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సబ్సిడీపై రుణాలు ఇవ్వాలి. ఏదో కొద్దిమందికే ఇళ్లు ఇచ్చారు. వివక్ష చూపక ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు చేయాలి. ఎస్ఆర్ఎస్ సర్జరీలు ఉచితంగా చేయాలి. తరచూ అనారోగ్యం బారిన పడుతున్నాం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి ట్రీట్‌మెంట్ ఇవ్వాలి. మేమూ మనుషులమేనని గుర్తిస్తే చాలు సమాజంలో గౌరవంగా బతుకుతాం.

– నట్టల సుమనవ్య, గురువు, విజయవాడ

విశాలాంధ్ర-డిజిటల్: సమాజంలో హిజ్రాలను థర్డ్ జెండర్ (మూడవ లింగం) అంటారు. మగవారిగా తాము జన్మించినా, కర్మానుసారం ఆడవారిగా మారిన తమకు సమాజంలో అడుగడుగునా అవమానాలు ఎదురౌతున్నాయని హిజ్రాలు వాపోతున్నారు. కుటుంబంలోనూ ఆదరణ కరువై దుర్భరజీవితం గడుపుతున్నామని కన్నీరు పెట్టుకుంటున్నారు. వివక్ష కారణంగా జీవనోపాధికి భిక్షాటన చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2014లో సుప్రీంకోర్టు వెలువరించిన 'నల్సా' (నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ) తీర్పు ప్రకారం స్త్రీ, పురుషులతో సమానంగా హక్కులు కల్పించాల్సి ఉన్నా క్షేత్రస్థాయిలో ప్రభుత్వాలు నూరు శాతం ఆ తీర్పును అమలుచేయడం లేదని, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సి ఉన్నా ప్రయోజనాలు అందని ద్రాక్షలా మిగిలిపోయాయని ఆవేదన చెందుతున్నారు. హార్మోన్ల ప్రభావం వల్లనే మాకీ జన్మ... మానవతా దృక్పథంలో ఆదరించండి... ఆధునిక సమాజంలోనైనా మాపై చిన్నచూపు వీడండి అంటూ కోరుతున్నారు ఈ 'మగ'వులు. మనుషులుగా గుర్తించండి చాలు... మా మానాన మేం బతుకుతున్నాం అంటూ వేడుకుంటున్నారు.

వాస్తవ ప్రపంచంలో హిజ్రాల జీవితాలు చూస్తుంటే విషాదకర ఘటనలే అధికం. హార్మోన్ల అసమతుల్యత వల్ల పుట్టి సమాజంలో చిన్నచూపునకు లోనవుతున్నారు. వీళ్లలో చాలా శాతం పెద్ద కుటుంబాల నుంచి వచ్చిన వారే ఎక్కువ. బాగా చదువుకున్న వారూ ఉన్నారు. వీరంతా మొదట్లో కుటుంబ సభ్యుల ప్రేమానురాగాల నడుమ పెరిగినవారే. వయసు పెరిగేకొద్దీ ఆడవారి లక్షణాలు శరీరంలో వృద్ధి చెందడంతో నిరాదరణకు గురవుతున్నారు.

వీరిది ఓ ప్రత్యేక కుటుంబం. అందరూ కలిసి ఓ గురువును ఎన్నుకుంటారు. అమ్మ, అత్త, అక్క, చెల్లి ఇలా... వరుసలతో పిలుచుకుంటూ వీరు కుటుంబంగా ఏర్పాటవుతారు. కార్మిక సంఘాల మాదిరిగానే వీరికీ ఓ సంఘం ఉంటుంది. ప్రతి నెలా సమావేశమౌతారు. సమస్యలను సంఘం పెద్ద దృష్టికి తీసుకెళ్తారు. తమలో ఎవరైనా నిబంధనలు అతిక్రమించి సమాజంలో తప్పు చేస్తే జరిమానాతో దండిస్తారు. భిక్షాటనే హిజ్రాలకు ప్రధాన వృత్తి. రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లు, మార్కెట్లు, షాపుల వద్ద భిక్షాటన చేస్తూ జీవనోపాధి పొందుతారు. అప్పుడప్పుడు ఉత్సవాలు, జాతరలు, ఊరేగింపుల్లో వీరు ప్రత్యేక ప్రదర్శనలిస్తూ ఇచ్చిన దాంతో సంతృప్తి చెందుతారు. కొందరు దసరాల్లో కనకదుర్గమ్మ దీక్ష చేపడతారు. నిమ్మకాయల దండ ధరించి భిక్షాటనకు బయలుదేరతారు. వచ్చిన డబ్బులో కొంత పేదల భోజనాలకు ఖర్చుపెడతారు. మామూలు మహిళల్లా ఉపవాసం ఉంటారు. మంగళ, శుక్రవారాలు భోజనం చేయరు. హిజ్రాగా మారిన వ్యక్తి 41 రోజులు దీక్ష చేస్తారు. విరమణ అనంతరం భోజనాలు పెట్టడం ఆనవాయితీ. ఎవరైనా చనిపోతే ఖననం చేయడం వీరి ఆచారం.

ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వీరికి వర్తిస్తాయి. ఎన్నికల సంఘం ఓటు హక్కు కూడా కల్పించింది. అయినా ఎన్నికల్లో పోటీచేసే హక్కు మాత్రం కల్పించలేదు. కష్టించి పని చేయలేం. మాకెవ్వరూ ఉద్యోగాలివ్వరు. డ్వాక్రా మహిళల మాదిరిగానే బ్యాంకు రుణాలు ఇస్తే సమాజంలో గౌరవంగా బతుకుతామంటున్నారు ట్రాన్స్‌జెండర్లు. దివ్యాంగులకు ఇచ్చినట్టుగానే తమకూ విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తరచూ అనారోగ్యానికి గురవుతున్నామని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి చికిత్స అందించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. తాము ఆటో ఎక్కితే సాటి ఆడవాళ్లు తమ పక్కనే కూర్చోరనీ, కొందరు మగాళ్లు అసభ్యంగా మాట్లాడతారని హిజ్రాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాజంలో తమను మనుషులతో సమానంగానే పరిగణించాలని వేడుకుంటున్నారు. ఇదిలా ఉండగా, 2011లో జనాభా లెక్కల ప్రకారం దేశంలో థర్డ్ జెండర్లు సుమారు 4.90 లక్షల మంది ఉన్నట్టు తేల్చారు. 1,37,000 మందితో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో ఉండగా, 43,800 మందితో రెండు తెలుగు రాష్ట్రాలు రెండో స్థానంలో ఉన్నాయి.

మోదీ సర్కారును గద్దెదించాలి

జేవీ సత్యనారాయణమూర్తి పిలుపు

విశాలాంధ్ర-సీలేరు(అల్లూరి జిల్లా): వచ్చే ఎన్నికల్లో ప్రజా వ్యతిరేక మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి పిలుపునిచ్చారు. అల్లూరి జిల్లా సీపీఐ సర్వసభ్య సమావేశం చింతపల్లిలో ఉద్యోగుల గిరిజన భవన్‌లో జిల్లా కార్యదర్శి పొట్టిగ సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ మోదీ పాలన అత్యంత కిరాతకంగా ఉందన్నారు. ఆర్ఎస్ ఎస్ అజెండాను నిస్సిగ్గుగా మోదీ ప్రభుత్వం అమలు చేస్తోందని మండిపడ్డారు. బీజేపీ ఇచ్చిన హామీలేవీ అమలు కాలేదని, మోదీ హయాంలో నిరుద్యోగం విపరీతంగా పెరిగిందని చెప్పారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీని గాలికి వదిలేశారన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ అధికారం చేపట్టిన నాటి నుంచి దేశంలో ఒక్క ప్రభుత్వ రంగ సంస్థను ఏర్పాటు చేయలేదని తెలిపారు. రిజర్వేషన్లు ఎత్తివేయాలన్న కుట్రలో భాగంగానే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకు కట్టబెడుతోందని విమర్శించారు. ఎనిమిదిన్నరేళ్లలో పెట్రో ధరలు విపరీతంగా పెరిగాయని, నిత్యావసర ధరలు ఆకాశాన్నంటాయని గుర్తు చేశారు. ఇలాంటి ప్రభుత్వాన్ని కొనసాగించడం మంచిది కాదని చెప్పారు. అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ అల్లూరి జిల్లాలో ఆగిపోయిన పార్టీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవాలని కోరారు. గ్రామశాఖ కార్యదర్శులు, మండల కార్యదర్శులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా సీబీఆర్

రెస్టారెంట్, పార్కు, బోటింగ్ వ్యవస్థ ప్రారంభం

సీఎం జగన్ జలవిహారం

విశాలాంధ్ర బ్యూరో-కడప: వైఎస్ఆర్ కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం పార్నపల్లెలోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్) ను సుప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చెప్పారు. రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా ప్రత్యేక విమానంలో శుక్రవారం కడప చేరుకున్న ముఖ్య మంత్రి.. హెలికాప్టర్ ద్వారా లింగాల మండలం పార్నపల్లె పరిధిలోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వద్దకు వచ్చారు. పర్యాటక శాఖ ద్వారా అభివృద్ధి చేసిన అనేక నిర్మాణాలకు ప్రారంభోత్సవం చేశారు. రూ.4.1 కోట్ల పాడా నిధులతో అధునా తనంగా నిర్మించిన వైఎస్ఆర్ లేక్ వ్యూ రెస్టారెంట్, పార్కుతో పాటు రూ.1.5 కోట్లతో ఏర్పాటు చేసిన 4 సీట్ల స్పీడ్ బోట్, 18 సీట్ల ఫ్లోటింగ్ జెట్టీ పర్యాటక బోటింగ్ వ్యవస్థకు సంబంధించిన శిలాఫలకాలను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. లేక్ వ్యూ పార్కులో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం వైఎస్ఆర్ లేక్ వ్యూ రెస్టారెంట్‌లో పర్యాటకుల కోసం అధునాతనంగా నిర్మించిన అతిథి గృహాలను ప్రారంభించారు. లేక్‌వ్యూ పాయింట్ నుండి రిజర్వాయర్ జలకళను, చుట్టూ ఆహ్లాదకరమైన పచ్చటి కొండల అందాలను తిలకిస్తూ కొద్దిసేపు సేద తీరారు. అంతకు ముందుగా...పర్యాటక శాఖ నూతనంగా ఏర్పాటు చేసిన పాంటున్ బోటులో కూర్చుని రిజర్వాయర్ జలాల్లో ముఖ్యమంత్రి షికారు చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి ఈ ప్రాంతం ఎంతో అనువైనదని, ఇక్కడ అన్ని వనరులు సమృద్ధిగా ఉన్నాయని సంతోషం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో పర్యాటకులను ఆకర్షించడానికి సీబీఆర్ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఉపముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్ బాషా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేశ్, జిల్లా కలెక్టర్ వి.విజయ్‌రామరాజు, ముఖ్యమంత్రి ఓఎస్డీలు ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, జేసీ సాయికాంత్ వర్మ, శిక్షణా కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, అడిషనల్ ఎస్పీ కృష్ణారావు, ఏఎస్పీ ప్రేరణ కుమార్, పాడా ఓఎస్డీ అనికుమార్ రెడ్డి, పులివెందుల ఆర్డీవో వెంకటేశ్వర్లు, డీఎస్పీ శ్రీనివాసులు తదితర అధికారులు పాల్గొన్నారు. సీబీఆర్ హెలిప్యాడ్ వద్ద ముఖ్య మంత్రికి స్వాగతం పలికిన వారిలో కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి, ఎమ్మెల్సీ రమేశ్‌యాదవ్, ఎమ్మెల్యేలు కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, పెద్దారెడ్డి, వైసీపీ నేతలు నైరుతిరెడ్డి, రామసుబ్బారెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, వైసీపీ నాయకులు ఉన్నారు. ఎస్పీ అన్బురాజన్ భారీ భద్రతా ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్ తిలకించిన సీఎం: వైఎస్ఆర్ లేక్ వ్యూ రెస్టారెంట్‌లో జిల్లా నీటి పారుదలశాఖ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సీఎం జగన్ తిలకిం చారు. జిల్లాలోని మేజర్ రిజర్వాయర్లు, ప్రాజెక్టులు, వాటి సామర్థ్యానికి సంబంధించిన వివరాలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు.

రహదారిపై నలుగురి సజీవ దహనం

విశాలాంధ్ర-ప్రత్తిపాడు: కాకినాడ జిల్లా, ప్రత్తిపాడు మండలం, ధర్మవరం జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కడియం నుంచి ఇసుక లోడుతో తుని వైపు వెళుతున్న లారీ అదుపు తప్పి డివైడర్ దాటి రాజమహేంద్రవరం వైపు రొయ్యలు లోడుతో వెళుతున్న కంటైనర్‌ను ఢీకొంది. దీంతో ఒక్కసారిగా రెండు వాహనాల క్యాబిన్‌లలో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో నలుగురు సజీవ దహనమయ్యారు. కంటైనర్ డ్రైవర్ ఉత్తరప్రదేశ్‌కు చెందిన వినోద్ కుమార్ యాదవ్, సూపర్ వైజర్ పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం యనమదుర్రుకి చెందిన కాళీ పెద్దిరాజు, కృష్ణాజిల్లా కోడూరు మండలం మెరకగుంటపాలేనికి చెందిన లారీ డ్రైవర్ జన్ను శ్రీను, ఇసుక లారీలో మరో గుర్తుతెలియని వ్యక్తి బూడిదయ్యారు. మృతదేహాలను ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పెద్దాపురం డీఎస్పీ సుంకర మురళీమోహన్, సీఐ కిషోర్ బాబు, ప్రత్తిపాడు ఎస్ఐ కె సుధాకర్, అన్నవరం ఎస్ఐ శోభన్ బాబు, ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పామాయిల్ రైతుల సమస్యలు పరిష్కరించాలి

వ్యవసాయశాఖ మంత్రికి కేవీవీ ప్రసాద్ లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పామాయిల్ రైతుల సమస్యల పరిష్కా రానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన రెడ్డికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధానకార్యదర్శి కేవీవీ ప్రసాద్ శుక్రవారం లేఖ రాశారు. పామాయిల్ పండ్ల గెలలకు టన్నుకు కనీస మద్దతు ధర రూ. 20వేలుగా నిర్ణయించాలనీ, ఇందుకోసం ధరల స్థిరీకరణ నిధి ఉపయోగించి రైతాంగం వద్ద ఉన్న గెలలను కొనుగోలు చేయాలని కోరారు. పామాయిల్ రైతులకు, కూలీలకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలనీ, పెట్రోల్, డీజిల్ రేట్లు పెరుగుదలబట్టి పామాయిల్ గెలల సరఫరాకు రవాణా చార్జీలు పెంచాలనీ, కంపెనీ వారు సరఫరా చేసిన మొక్కలలో నాసిరకం మొక్కలు ఉండటం వలన నాలుగు సంవత్సరాల తరువాత పండ్ల గెలలు కాయకపోతే రైతులకు కంపెనీయే నష్టపరిహారం ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చూడాలని విజ్ఞప్తి చేశారు. పామాయిల్ తోటలకు వెళ్లే రహదారులను గోద్రేజ్ యాజమాన్యం అభివృద్ధి పరచాలనీ, పామాయిల్ మొక్కలకు డ్రిప్ పరికరాలకు, ఎరువులు, కలుపు మందులకు సబ్సిడీ ఇవ్వాలనీ, పామాయిల్ కంపెనీల రీసెర్చ్ అండ్ అనాలసిస్ డెవలప్‌మెంట్ సంస్థలతో గెలల కోతకు మట్టల్ని మొక్కలు చేయడానికి ఆధునిక పరికరాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. పామాయిల్ పండ్ల గెలల ధరల నిర్ణాయక కమిటీ ప్రతినెల మొదటి వారంలో ధర నిర్ణయించి, అది అమలయ్యేలా చూడాలని కోరారు. ఈ సమస్యలన్నింటిపై తక్షణమే రైతులు, యాజమాన్యాల ప్రతినిధులు, అధికారులతో సంప్రదింపులు జరిపి సమస్య పరిష్కారానికి కృషిచేయాలనిఆ లేఖలో కేవీవీ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కు సేకరిస్తున్న

డి.ఫారం భూములకు పరిహారం చెల్లించాలి

సీఎం జగన్‌కు సీపీఎం శ్రీనివాసరావు లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైజాగ్-చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్‌కు సేకరిస్తున్న డి.ఫారం భూములకు కూడా పరిహారం చెల్లించాలని కోరుతూ సీఎం జగన్‌కు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శుక్రవారం లేఖ రాశారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం చందనాడ గ్రామానికి చెందిన 26 నిరుపేద దళిత కుటుంబాలకు 1975 సంవత్సరంలో ప్రభుత్వం ల్యాండ్ సీలింగ్ ద్వారా 43.23 ఎకరాల డి ఫారం భూమిని ఇచ్చిందనీ, ఆ భూముల్లో వ్యవసాయం, గుల్లబట్టీలు ఏర్పాటు చేసుకుని సున్నం, ముగ్గు తయారీ తదితరాలపై ఆధారపడి వారు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇటీవల ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు సేకరించే భూములలో ఇవి కూడా ఉన్నాయనీ, . వీరికి ఈ భూమి తప్ప మరొక జీవనాధారం లేదని తెలిపారు. పరిహారం కోసం వారు ఆందోళన చేస్తున్నారు. కనుక 2013 భూసేకరణ చట్ట ప్రకారం పరిహారం ఇవ్వాలని కోరారు. నక్కపల్లి మండలం గునుపూడి, బంగారమ్మ పేట గ్రామాలలో సర్వే నంబర్లు 203, 204, 205, 206, 207లలో గల సుమారు 40 ఎకరాలు, కోట ఉరట్ల మండలం రాట్నాలపాలెం గ్రామం సర్వే నెంబరు 316లో 70 ఎకరాలు ఆ గ్రామాలకే చెందిన దళిత, బీసీ నిరుపేదలకు 1975 సంవత్సరంలోనే ప్రభుత్వం మంజూరు చేసింది. ఇదంతా లోతట్టు భూమి కావడంతో గట్లు మొత్తం పోయాయి. ఆ భూముల హక్కుదార్లుగా అడంగల్‌లో ఈ భూములతో ఏ సంబంధం లేనివారిపేర్లతో ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దీని కారణంగా ప్రభుత్వం నుంచి రైతులకు అందవలసిన ఏ పథకమూ వీరికి అందడం లేదనీ, తక్షణం జోక్యం చేసుకొని ఈ భూములను సర్వే చేయించి సర్వేనంబర్ల వారీగా రైతులకు అప్పజెప్పాలని శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

కడప స్టీల్‌ప్లాంట్ పరిస్థితి ఏంటి?

సీఎం జగన్ ప్రకటన చేయాలని

ఈశ్వరయ్య డిమాండ్

విశాలాంధ్ర-కడప రూరల్: కడప స్టీల్‌ప్లాంట్ పనులు మూడేళ్లుగా ఎందుకు ప్రారంభించలేదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ కోసం కేంద్రం మెడలు వంచుతానన్న ప్రగల్భాలు ఏమయ్యాయని నిలదీశారు. కడప స్టీల్‌ప్లాంట్ పరిస్థితిపై ప్రకటన చేయాలని సీఎం జగన్‌ను డిమాండ్ చేశారు. సీపీఐ కడప నగర సమితి సమావేశం శుక్రవారం హోచిమిన్ భవన్‌లో నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈశ్వరయ్య మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం సీపీఐ నేతృత్వంలో డిసెంబర్ 9 నుంచి 13 వరకు చేపట్టే పాదయాత్రకు అన్ని వర్గాల మద్దతు కావాలని కోరారు. కడప స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి రాష్ట్ర విభజన చట్టం హామీ ఇచ్చిందని, అయినా మోదీ సర్కారు దీనిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ నిర్మాణం జరిగి ఉంటే నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, ఉపాధి లభించేదని, పారిశ్రామికంగా రాష్ట్రం అభివృద్ధి చెందేదని చెప్పారు. వైఎస్సార్ స్టీల్స్ లిమిటెడ్ పేరుతో రూ.25 వేల కోట్లు ఖర్చుతో స్టీల్‌ప్లాంట్ నిర్మిస్తామని చెబుతూ 2019 డిసెంబర్ 23న జమ్మలమడుగు మండలంలో సీఎం జగన్ శంకుస్థాపన చేశారని, అప్పటి నుంచి పనులు మాత్రం ప్రారంభం కాలేదని ఈశ్వరయ్య విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ కోసం సీపీఐ చేపట్టే పాదయాత్రలో తనతో పాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి ఓబులేసు, జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు, సమితి సభ్యులు పాల్గొంటారని ఈశ్వరయ్య తెలిపారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి కె.నారాయణ, పార్లమెంట్ సభ్యులు వినయ్ విశ్వం వస్తారన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ, నగర సహాయ కార్యదర్శి కేసీ బాదుల్లా, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు, వేణుగోపాల్, విజయలక్ష్మి, గంగా సురేశ్, నగర సమితి సభ్యులు సావంత్ సుధాకర్, ఓబయ్య, మునయ్య, మల్లికార్జున, మనోహర్‌రెడ్డి, బ్రహ్మం, నాయక్, ఓ.బాబు, మైనుద్దీన్, నారాయణ, భీమరాజు, భాగ్యలక్ష్మి, ఆచారమ్మ తదితరులు పాల్గొన్నారు.

12మంది విద్యార్థినులకు అస్వస్థత

విశాలాంధ్ర-శృంగవరపుకోట: విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం, తాటిపూడిలోని ఏపీ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినిలు తిన్న ఆహారం ఫుడ్ పాయిజన్ కావడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. 12 మంది విద్యార్థినిలు కడుపునొప్పి, వాంతుల బారిన పడ్డారు. వారిలో తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్న ఆరుగురిని కళాశాల సిబ్బంది మెరుగైన చికిత్స నిమిత్తం శృంగవరపుకోట ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి కుదుటపడిందని, ఎటువంటి అపాయం లేదని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.వి.సత్యశేఖర్ వెల్లడించారు. గురువారం రాత్రి పదిమంది విద్యార్థునులకు చికిత్స అందించామని, అందులో నలుగురికి ఎటువంటి అపాయం లేకపోవడంతో తిరిగి కాలేజీకి పంపించివేశామని, కాలేజీ ఆవరణలో కూడా వైద్య శిబిరం కొనసాగిస్తున్నట్టు కొట్టాం పీహెచ్‌సీ వైద్యాధికారి లావణ్య తెలిపారు. ఇదిలావుండగా కళాశాలలో 170 మంది విద్యార్థినిలు, అధ్యాపకులు, సిబ్బంది అందరూ ఈ భోజనమే చేశారని, వీరిలో కొండరపు నవదేవిక, బంగారు లాజ్ ఓనిజాయ్, పాలు వెంకట జయశ్రీ, అవిత వైష్ణవి ప్రియ, పోలవలస శ్యామలత, బొగ్గు రమ్య ఎస్.కోట ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా కాలేజీ హాస్టల్లో టి.లిఖిత, వై.హరి పూజిత, డి.సాత్విక, వై.శ్రీదేవి, డి.వరలక్ష్మి, డి.కార్తీక, టి.రేవతి తదితర విద్యార్థినిలు చికిత్స పొందుతున్నారని, అస్వస్థతకు గురి కావటానికి కారణం ఏమై ఉంటుందో అర్థం కావటం లేదని ప్రిన్సిపాల్ శారదాబాయి వ్యాఖ్యానించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినిలను జిల్లా వైద్యాధికారి రమణకుమారి, డీసీహెచ్ఎస్ నాగభూషణరావు, ఆర్డీఓ సూర్యకళ, తహసీల్దార్ శ్రీనివాసరావు పరామర్శించారు.

జగనన్న ఇళ్ల నిర్మాణానికి రూ.ఐదు లక్షలు

రామచంద్రయ్య డిమాండ్

విశాలాంధ్ర-పత్తికొండ: జగనన్న ఇళ్ల నిర్మాణాలకు ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామ చంద్రయ్య డిమాండ్ చేశారు. సీపీఐ ప్రతినిధి బృందం శుక్రవారం మండలంలో జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇళ్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చి, మాట తప్పిందన్నారు. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలకు ఒక్కొక్క ఇంటికి 1.80 లక్షల రూపాయలు మంజూరు చేయడం వల్ల, ఇళ్ల నిర్మాణం పూర్తికాక, పునాదులకే సరిపోతున్నాయని, ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలంటే ఒక్కో ఇంటికి 5 లక్షల రూపాయలు చెల్లించాలని రామచంద్రయ్య డిమాండ్ చేశారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఈ నెల 5వ తేదీన లబ్ధిదారులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో తహసిల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, మండల సహాయ కార్యదర్శి రంగన్న, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు గురుదాస్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, రైతు సంఘం తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు కారన్న, పెద్ద ఈరన్న, నాయకులు పులికొండ, ఓబులేసు, వసంత, నాగిరెడ్డి తదితరులు ఈ ప్రతినిధిబృందంలో ఉన్నారు.

టిడ్కో ఇళ్లపై ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొనేపూడి శంకర్
- 9న జగ్గయ్యపేటలో నిరసన ప్రదర్శన, ధర్నా

విశాలాంధ్ర-జగ్గయ్యపేట: టిడ్కో ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనేపుడి శంకర్ డిమాండ్ చేశారు. జగ్గయ్యపేటలోని టిడ్కో ఇళ్లను శుక్రవారం సీపీఐ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ... టిడ్కో ఇళ్ల విషయంలో లబ్ధిదారులను రాష్ట్ర ప్రభుత్వం మభ్య పెడుతోందని విమర్శించారు. జగ్గయ్యపేటలో సుమారు 3245 టిడ్కో ఇళ్లు 80 శాతం మేర నిర్మాణం పూర్తయినప్పటికీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయని, విష సర్పాలకు కేంద్రంగా తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. లబ్ధిదారులకు నివాసయోగ్యంగా ఉండేందుకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు కరెంటు, మంచినీరు, డ్రైనేజీలు, రోడ్లను నిర్మించడంలో అలసత్వం వహించడం దారుణమని అన్నారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులను అప్పగించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 9 న జగ్గయ్యపేటలో సీపీఐ అధ్వర్యంలో నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో లబ్ధిదారులందరూ భాగస్వామ్యం కావాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లంకా గోవిందరాజులు, పెయ్యల పృథ్వీ, పట్టణ కార్యదర్శి జూనె బోయిన శ్రీనివాసరావు, నియోజకవర్గ పార్టీ సహాయ కార్యదర్శి అంబోజి శివాజీ, నాయకులు పోతిపాక వెంకటేశ్వర్లు, మాశెట్టి రమేష్, మహమ్మద్ అసదుల్లా, భోగ్యం నాగులు, మేతికల శ్రీను, జానీ, భాను, నాని, రాణి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ తీరంలో విన్యాసాల సందడి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ నగర తీర ప్రాంతంలో నేవీ విన్యా సాల సందడి నెలకొంది. నేవీ డే వేడుకలకు విశాఖ తీరం ముస్తాబవుతోంది. ఆర్కే బీచ్‌లో యుద్ధనౌకలు, నేవీ హెలికాప్టర్లతో మాక్ విన్యాసాలు అదుర్స్ అనిపిస్తు న్నాయి. డిసెంబర్ 4న జరిగే నేవీ డే వేడుకలకు ఆర్కే బీచ్‌లో కొద్ది రోజులుగా ముమ్మరంగా రిహార్సల్స్ నిర్వహిస్తున్నారు. శుక్రవారం నావికా బ్యాండ్, నేవీ సైన్యం చేపట్టిన ప్రీ రిహార్సల్స్ అందర్నీ ఆకట్టుకున్నాయి. సముద్రంలో యుద్ధనౌకలు, హెలికాప్టర్ల విన్యాసాలను చూసేందుకు విశాఖ నగర వాసులే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు బీచ్‌కు చేరుకుం టున్నారు. దీంతో ఆర్కే బీచ్ సందడిగా మారింది. యుద్ధ సమయంలో నావికాదళం ఎలా స్పందిస్తుంది, శత్రువులపై ఎలా ఎదురుదాడికి దిగుతుందో కళ్లకు కట్టినట్లు చూపించారు. తీరానికి వచ్చిన సందర్శకులు ఈ విన్యాసాలను ఆసక్తిగా తిలకిస్తున్నారు. మరోపక్క రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము వస్తుండటంతో భద్రత ఏర్పాట్లు, ప్రధాన వేదిక నిర్మాణంతో పాటు విన్యాసాలు తిలకించేందుకు ప్రజలకు ఏర్పాట్లపై అధికారులు నిమగ్నమై ఉన్నారు. విశాఖ సాగర తీరం ఆదివారం జనసంద్రంగా మారనుంది. ఇప్పటికే నగర పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు తెలియజేశారు.

కానిస్టేబుల్ ఆత్మహత్య

విశాలాంధ్ర-నంద్యాల: నంద్యాల జిల్లా కేంద్రంలోని మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ వై. రామకృష్ణ శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుస్టేషన్‌లోనే ఆత్మహత్య చేసుకోవడం సంచలనంగా మారింది. రామకృష్ణ స్వగ్రామం సిరువెళ్ల మండలం కోటపాడు గ్రామం. 2011 బ్యాచ్‌కు చెందిన రామకృష్ణ ఆళ్లగడ్డ, సంజామల స్టేషన్‌లలో పనిచేశాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు. ఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ రఘువీరారెడ్డి పరిశీలించారు. కానిస్టేబుల్ ఆత్మహత్యపై నంద్యాల డీఎస్పీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణగా విధులు నిర్వహించే కానిస్టేబుల్ రామకృష్ణ ఆత్మహత్య బాధాకరమని, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆత్మహత్యకు గల కారణాలను విచారించి పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION

Tender Notice No.57/2022-23/SE(W-II)/EE-IV/DB/GVMC, Dt:29-11-2022

Number of works	:	1 No
Value of work	:	Rs.66.68 Lakhs
Tender Opening Date	:	02-12-2022
Closing Date	:	16-12-2022

Note: Further details at http://www.tender.apeprocurement.gov.in

O/o the EE-IV Cell No.8187897572 SE(Works)-II

సంపాదకీయం

దూషణ పర్వం

ఎన్నికల ప్రచార సమయంలో వివిధ పార్టీల రాజకీయ నాయకులు పరస్పర దూషణలకు పాల్పడడం మామూలే. కానీ ఈ క్రమంలో తాము వాడే భాష మర్యాదకరంగా ఉండేట్టు చూసుకోవడంలో విఫలం కావడం కచ్చితంగా ప్రతికూల పరిణామమే. గుజరాత్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మల్లికార్జున్ ఖడ్గే ప్రధానమంత్రి మోదీని రావణుడు అన్నారని గగ్గోలు పెడ్తున్నారు. ఇది మర్యాద అతిక్రమించడమేనని వాదిస్తున్న వారూ ఉన్నారు. కానీ నిజానికి ఖడ్గే ప్రసంగంలో మోదీని రావణుడితో పోల్చారో లేదో వివేచించే వారు కరవయ్యారు. ఖడ్గే ఈ మాట అనడానికి నిర్దిష్ట కారణం ఉందన్న వాస్తవాన్ని విస్మరిస్తున్నారు. గుజరాత్‌లోనే కాదు, ఎక్కడ ఎన్నికలు జరుగుతున్నా మోదీ ప్రత్యక్షమవుతారు. ఒక్కో రాష్ట్రంలో పదుల కొద్దీ సభలు, సమావేశాలు, ర్యాలీలు, రోడ్ షోలలో పాల్గొంటారు. గుజరాత్ ఎన్నికలతో మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పరువు ప్రతిష్ఠలు ఆధారపడి ఉన్నాయి. గుజరాత్ వారిద్దరి సొంత రాష్ట్రం. గుజరాత్‌లో 27 ఏళ్లుగా బీజేపీ అధికారంలో ఉన్న మాట వాస్తవమే. కానీ ఒక్కో దఫా జరిగిన ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే క్రమంగా బీజేపీ విజయం సాధిస్తున్న సీట్ల సంఖ్య తగ్గుతోంది. అందుకని గుజరాత్ ఎన్నికల ప్రచారానికి మోదీ ఎక్కువ సమయం కేటాయించారు. ఇంతకు ముందు ఏ ప్రధానమంత్రి ఒకే రాష్ట్రంలో ఎన్నికల సమావేశానికి ఇంత సమయం కేటాయించలేదు. ప్రచార క్రమం పొడవునా ఆయన ఎక్కడ చూసినా తారసపడ్తున్నారు. ఈ నేపథ్యంలోనే రావణుడికి పది తలలు ఉన్నట్టు మోదీకి వంద తలలున్నాయా ఎక్కడ చూసినా ఆయనే కనిపిస్తున్నారు అని ఖడ్గే అన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రధానమంత్రి స్థానంలో ఉన్న మోదీ సర్వాంతర్యామిలా కనిపిస్తున్నారు కనక ఖడ్గే రావణుడి పది తలల పోలిక తెచ్చారు. అన్ని చోట్లా మోదీయే కనిపిస్తున్నారు కనక వంద తలలున్నాయా అని ప్రశ్నించారు. ఇది పోలిక చెప్పడమే. ఖడ్గే చెప్పదలచుకున్న విషయాన్ని ఉపమాలంకార సహాయంతో చెప్పే ప్రయత్నంలోనే రావణుడి ప్రస్తావన తీసుకొచ్చారు తప్ప మోదీని ఆయన రావణుడితో పోల్చలేదు. మోదీ రావణుడు అని అనలేదు. రావణుడు అన్న మాటను పట్టుకుని మోదీని రావణుడితో పోల్చారని వ్యాఖ్యానించే వారికి కొరత లేకుండా పోయింది. సకల విషయాలను వక్రీకరించడంలో లేనివి ఉన్నట్టుగా చూపడంలో, శుష్క వాగ్దానాలు చేయడంలో మోదీని మించిన వారు లేరు. ఖడ్గే వ్యాఖ్యలను కూడా మోదీ స్వయంగా వక్రీకరిస్తున్నారు. కాంగ్రెస్‌కు రాముడి మీద భక్తి లేదని, అయోధ్య అంటే వారికి గిట్టదని, రామసేతును వారు నమ్మరని మోదీ అంటున్నారు. ఆది కావ్యంలో వాల్మీకి రాముడి సద్గుణాలను చాలా ప్రతిభావంతంగా చిత్రించారు. సకల సద్గుణ సంపన్నుడిగా చూపారు. వాల్మీకి శ్రీరాముడి పాత్రను చిత్రించిన తీరు రాముడిని దేవుడిని చేసేసింది. ఒక కావ్యంలో ఉన్న కథా నాయకుడిని దేవుడిగా భావించడం అపురూపమే. కావ్య నాయకుడిని వాస్తవికంగా జీవించిన వ్యక్తిగా భావించడమే ఇబ్బంది. అంటే జనం రాముడిని దేవుడిగా భావిస్తున్నారు కనక రాముడి గురించి ఏం మాట్లాడినా నొచ్చుకునేవారు ఉన్నారు. ఖడ్గే రావణుడిని ప్రస్తావించడంలోనూ ఇదే జరిగింది. ఖడ్గే మాటలు బీజేపీ నిందా ప్రచారానికి బాగా తోడ్పడ్డాయి. ఇలాంటి ఏ అవకాశాన్ని మోదీ వదులుకోరు. ప్రధానమంత్రిని రావణుడితో పోలుస్తారా అని మోదీ నిలదీస్తున్నారు. ప్రధానమంత్రిని గౌరవించాలనడాన్ని అభ్యంతర పెట్టలేం. కానీ ఖడ్గే మాటలను సందర్భ శుద్ధి లేకుండా సాగలాగడం విచిత్రంగా ఉంది. ఖడ్గే అన్న మాటలు బీజేపీకి ఎదురుదాడి చేయడానికి అప్పనంగా అంది వచ్చాయి. ఆయన మాటలను వాటంగా మోదీ వక్రీకరించారు. ఎన్నికల సమయంలో పరస్పర ఆరోపణలను తనకు అనుకూలంగా మలుచుకోవడంలో ఎవరైనా మోదీ తరవాతే. అందుకే కాంగ్రెస్‌కు రాముడంటే నచ్చదని, రామసేతును నమ్మరని, అయోధ్య అంటే ఇష్టం లేదని మోదీ అనగలిగారు. రాముడి పేరుతో హిందువుల ఓట్లు సంఘటితం చేయడానికే మోదీ ఈ పాట్లు పడ్తున్నారు. ఈ సారి మోదీ, అమిత్ షా ద్వయానికి గుజరాత్‌లో ఓడిపోతామన్న భయం పట్టుకుంది. అందుకే ప్రచారానికి మోదీ అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. ఖడ్గే మాటలు ఆయనకు బాగా ఉపకరించాయి.

ఖడ్గే ఎలాంటి వారో తనకు తెలుసుననీ అయితే కాంగ్రెస్ నాయకులు అంటే సోనియా గాంధీ ఇత్యాదులు ఆయనకు కిర్రెక్కించి పంపినందువల్లే ఆయనను రావణుడితో పోల్చారని, మోదీ ఖడ్గే మాటలను తనకు అనువుగా మలుచుకోగలిగారు. శ్రీరాముడి అస్తిత్వాన్నే ఒప్పని కాంగ్రెస్ తనను విమర్శించడానికి మాత్రం రామాయణంలోని రావణుడిని పాత్రను వినియోగించుకుంటోందని వాదించి మోదీ ఈ మొత్తం వ్యవహారాన్ని మతవిశ్వాసాల రొంపిలోకి లాగారు. పార్లమెంటులోనే కాదు ఎన్నికల ప్రచారంలో నాయకుల ప్రసంగాలు మర్యాదకరమైన భాషలోనే ఉండాలనడం తిరుగులేనిదే. కానీ ఇటీవలి కాలంలో ఆ మర్యాదను పాటించడంకన్నా ఉల్లంఘించిన సందర్భాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. సోనియా గాంధీ గతంలో మోదీని మృత్యు బేహారి అన్నప్పుడూ వివాదం చెలరేగింది. కానీ మోదీ అంతకంతకూ బదులు తీర్చుకున్నారు. సోనియా గాంధీని ఆయన జెర్సీ ఆవు అన్నారు. ఈ మాట వాడిన మోదీ ఒక మహిళను అవమానిస్తున్నానని గ్రహించలేదు. సంఘ పరివార్ ఆరాధించే గోవును కూడా ఈ రచ్చలోకి లాగారు. కాంగ్రెస్ వారు నోరుజారి తనను విమర్శించారనుకున్నా ఆ తరవాత పొరపాటు గ్రహించి క్షమాపణ అయినా చెప్పరు అని మోదీ అంటున్నారు. ఇదే సూత్రం మోదీకీ వర్తిస్తుంది. గుజరాత్ మారణకాండకు ఆయన ఏనాడైనా క్షమాపణ చెప్పిన సందర్భం ఉందా? మారణకాండ సమయంలో ముఖ్యమంత్రిగా మోదీ పాత్రను సవాలుచేస్తూ కోర్టుల్లో దాఖలైన కేసులు తేలిపోయి ఉండొచ్చు. కానీ ఆ మారణకాండకు నైతికంగా బాధ్యత తనదేనని మోదీ భావించిన సందర్భమే లేదు. రాజధర్మం విస్మరిస్తున్నారని అప్పటి ప్రధాని సుతిమెత్తగా తప్పుబట్టడాన్ని మోదీ ఖాతరు చేయలేదు. పైగా తొలిదశ పోలింగ్ జరగడానికి సరిగ్గా ఒక వారం రోజుల ముందు అమిత్ షా 20 ఏళ్ల కింద తాము తగిన గుణపాఠం చెప్పినందువల్ల అప్పటినుంచి గుజరాత్‌లో మతకలహాలే జరగలేదని గొప్పగా చెప్పుకోవడంలోని ఆంతర్యాన్ని గ్రహించని అమాయకులు ఎవరుంటారు? అప్పుడు మోదీ లేదా సంఘ పరివార్ గుణపాఠం నేర్పింది ఎవరికి అన్న ఆలోచన సవ్యంగా ఆలోచించే వారి మెదళ్లకు తట్టకుండా ఉంటుందా! ఇన్నాళ్లు మారణకాండతో మోదీకి ఎలాంటి సంబంధమూ లేదని వాదించిన వారు ఇప్పుడు గుణపాఠం చెప్పామని ప్రస్తావిస్తుంటే ఆ మారణకాండ వారి పుణ్యమేనని అనుకుంటే ఉలుకుఎందుకో! 27 ఏళ్లుగా గుజరాత్‌లో బీజేపీ అధికారంలో ఉన్నందువల్ల ప్రజల్లో వ్యతిరేకత ఉండడం సహజం. ఈ వ్యతిరేకత నుంచి, అసలు సమస్యల నుంచి జనం దృష్టి మళ్లించడానికే అమిత్‌షా 2022 నాటి మారణకాండను ప్రస్తావించారు. ఖడ్గేను తప్పుబట్టే క్రమంలోనే మళ్లీ మోదీ సర్దార్ పటేల్ మొదటి ప్రధానమంత్రి కావాల్సింది అన్న పాత వాదనకు మరింత పదును పెట్టారు.

ఘనా 'గాన' సుందరా..

"సంగీతం వింటున్నప్పుడు
ఒక ప్రపంచానికి రెప్ప మూసి
మరో ప్రపంచానికి రెక్క విప్పుతాం"

ఇవి కవి వసీరా సంగీతం అనే పద్యంలోని కవితాపంక్తులు.

"బతుకంతా ప్రతి నిముషం పాటలాగ సాగాలి" అని దేవులపల్లి కృష్ణశాస్త్రి ప్రతి రాత్రి వసంత రాత్రి... పాటలో అన్నారు.

ఈ రెండు కవిత్వ పంక్తుల్లో మొదటిది సంగీత ప్రేమికులకు అతికినట్లు సరిపోతుంది. ఇక రెండోపాట లైను మహాగాయకుడు ఘంటసాలకు అతికినట్లుగా సరిపోతుంది. "ఘంటసాల ఉత్తరాదిన పుట్టకపోవడం మేం చేసుకున్న అదృష్టం" అన్నాడొకసారి ఉత్తరాది మహా గాయకుడు మహ్మద్ రఫీ. అందులో ఆయన స్వార్థం ఉంది. నిజంగా ఘంటసాల ఉత్తరాదినే పుట్టి ఉంటే అక్కడ మహా గాయకులనిపించుకున్న వారంతా ఈ మహానుభావుడి తర్వాతి వరుసలో ఉండాల్సిన వారే. జనన, మరణాలు మానవుల చేతిలో ఉండవు కాబట్టి అది అలా జరిగిపోతుందంతే.

తెలుగు వారిలో ఉండే, ఎప్పటికీ పోనీ ఓ జాడ్యం మన వారిని త్వరగా గుర్తించకపోవడం. లేదూ గుర్తించినా సాధ్యమైనంత త్వరగా ఆ గొప్పవారిని అణిచి వేయాలనుకోవడం. ఘంటసాల ఇందుకు మినహాయింపు కాదు. అలాగని చివరి వాడు కాదు. కానీ ఘంటసాల మాత్రం పోయిన చోటనే వెతుక్కోవడం కాదు... అక్కడే నిలిచారు. గెలిచారు. గ్రామ్‌ఫోన్ రికార్డుల కంపెనీ హెచ్‌ఎంవీ "నీది పీల గొంతు" అన్నా పట్టించుకోలేదు. ఆనాడు హెచ్‌ఎంవీ కంపెనీకి తెలుగు విభాగం మేనేజర్ గా ఉన్న నటుడు, దర్శకుడు పేకేటి శివరాం చేసిన ధైర్యం కారణంగా తెలుగు వారు ఓ మహా గాయకుడ్ని వినే అదృష్టాన్ని పొందారు. తాను పని చేస్తున్న కంపెనీలో ఎవరు ఎలాంటి చికాకులు పెడతారో అనే సంశయాన్ని పక్కన పెట్టి పేకేటి శివరాం ఆ పీల గొంతు ఘంటసాల చేత " నగుమోమునకు నిశానాథ బింబము జోడు" అనే పద్యాన్ని గ్రామ్‌ఫోన్ రికార్డుగా విడుదల చేయడం తెలుగు పాటకు దక్కిన గౌరవం.

అలా ప్రారంభమైన ఘంటసాల శకం ఐదు దశాబ్దాల పాటు అవిచ్ఛిన్నంగా పాటలా సాగింది. కాలంతో వచ్చిన మార్పును స్వాగతించిన ఘంటసాల సినీ పరిశ్రమలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పాటలు పాడారు. నిజానికి మహాకవి కాళిదాసు సినిమాలో అక్కినేనికి " మాణిక్యవీణా ముఫలాలయంతీం" పద్యం పాడిన ఘంటసాల... ఓ పుష్కరకాలం తర్వాత మళ్లీ అక్కినేనికే దత్తపుత్రుడు సినిమాలో "పిల్లో జాగ్రత్త... వొళ్లు కాస్త జాగ్రత్త" అనే వెకిలి పాట పాడాల్సి రావడం సినీ వంచితం కాక ఇంకేమిటి. జీవిక కోసం పాటలు పాడేందుకు అంగీకరించిన పాపానికి ఇలాంటి పాటలు చాలానే పాడారు ఆ మహానుభావుడు ఘంటసాల. ఈ వేదనని భరించేందుకు ఘంటసాల పాడిన " నేనొక పూలమొక్కకడ నిల్చి... చివాలున కొమ్మవంచి" వంటి పుష్పవిలాపం, మరికొన్ని జానపద గీతాలు ఆయన్ని కాసింత సేద తీర్చి ఉంటాయి.

"కుల మతాలు గీచుకున్న గీతల చొచ్చి
పంజరాన కట్టువడను నేను" అన్న గుర్రం జాషువాలా... అగ్రవర్ణాల మధ్య చిక్కుకున్న "భగవద్గీత"ను రికార్డు చేసి ప్రజల మధ్యకు తీసుకువచ్చింది కూడా ఘంటసాలే. అయితే, ఘంటసాల గానం చేసి విని ఆనందించండ్రా అన్న ఆ భగవద్గీతను కూడా మన వాళ్లు శవ యాత్రలకు పరిమితం చేయడం తెలుగు వారు మాత్రమే చేయగలిగిన మహాపరాధం. ఆ అపరాధం ఇప్పుడు తుడిచిపెట్టలేనంతగా తెలుగు ప్రజలకు చేరువైంది. ఆలయాల్లో కూడా ఘంటసాల భగవద్గీతను వినలేని దౌర్భగ్య స్థితిలో ఉన్నాం అనుకోవడం మినహా. ఘంటసాల వారి శత జయంతి సందర్భంగా ఆయన విగ్రహాల ఏర్పాటు, జయంతి ఉత్సవాలు నిర్వహించడం ఎలాగూ చేస్తున్నారు. ఘంటసాల ఎంతో భక్తితో పాడిన ఆ భగవద్గీతకు ఈ శవయాత్రల నుంచి విముక్తి కలిగిస్తే ఆయన ఆత్మ శాంతిస్తుంది. ఎవరైనా ఈ పని చేస్తే అదే ఆయనకు ఘనమైన నివాళి.

చక్రవాకం - ముక్కాముల చక్రధర్

వ్యాస రచయిత సెల్: 9912019929

దళితుల రణభేరి

గుల్జార్‌సింగ్ గొరియా

దేశవ్యాప్తంగా తమపై జరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు దళితులు రణభేరి మోగించారు. వివిధ దళితుల సంఘాల ఆధ్వర్యంలో నవంబరు 5న ఢిల్లీ సుర్జిత్ భవన్‌లో జరిగిన జాతీయ సదస్సు ఈ సమస్యను పాలకులు పరిష్కరించాలని డిమాండ్ చేసింది. 600 మందికిపైగా సదస్సులో పాల్గొన్నారు. 2023 ఫిబ్రరి 28న జాతీయస్థాయిలో నిరసనదినం పాటించాలని సదస్సు తీర్మానించింది. అలాగే జనవరి 23న రాష్ట్రస్థాయిలో సదస్సులు నిర్వహించాలని తీర్మానించారు. దళిత వ్యతిరేక శక్తులు హతమార్చిన దళితులకు నివాళి సమర్పించారు. దళిత్‌సోశన్ ముక్తి మంచ్(డిఎస్ఎంఎం), అఖిలభారత వ్యవసాయ కార్మిక యూనియన్ (ఏఐఏడబ్ల్యుయు), అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం(ఏఐడిఆర్ఎం), భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బికెఎంయు), అఖిలభారత వ్యవసాయ, గ్రామీణ, కూలీల అసోసియేషన్ (ఏపీఏఆర్ఎల్ఏ) ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. రామ్‌చందర్ డామె, ఎ.రామమూర్తి, బి.వెంకట్, దీవికుమారి, శ్రీరామ్ చౌదరి అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. సఫాయి కర్మచారి ఆందోళన కన్వీనరు బెజవాడ విల్సన్ సదస్సును ప్రారంభిస్తూ, మన సమాజం సమానత్వం కావాలి. దేశంలో కులవివక్ష ఉండకూడదు. దళితులు యాచకులు కాదు. తమ హక్కులకోసం, అంటరానితనం, పేదరికం నిర్మూలన, వివక్ష అంతంకోసం పోరాడుతున్నారు. విభేదాలను విడిచిపెట్టి రాజ్యాంగం పరిరక్షణకోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ముసాయిదా తీర్మానం ఇలా ఉంది. ఈ తీర్మానాన్ని సుభాషిణి అలీ ప్రవేశపెట్టారు. 2014లో బీజేపీ-ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం అధికారానికి వచ్చిన తర్వాత రోజురోజుకీ అత్యాచారాలు పెరుగుతున్నాయి. బీజేపీ ప్రభుత్వ రాజ్యాంగాన్ని తిరస్కరించి మనుస్మృతికి అంకితమై పనిచేస్తోంది. ప్రజాస్వామ్య హక్కులపై దాడిచేస్తూ, మతతత్వధోరణి అవలంబిస్తున్నారు. మహిళలపై అత్యాచారాలు, హింసించడం నిత్యకృత్యమయ్యాయి. సగటున రోజుకి కనీసం పది ఇలాంటి కేసులు నమోదవుతున్నాయి. దోషులను బీజేపీ నాయకులు కాపాడుతున్నారు. వీటికి వ్యతిరేకంగా ఐక్యంగా నిరంతరపోరాటం చేయాలని సుభాషిణి అలీ పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ లక్ష్మయ్య మాట్లాడుతూ, గత 26ఏళ్ల కాలంలో 18వేల మంది దళితులను హత్య చేశారు. 45వేల మంది దళిత మహిళలపై అత్యాచారం చేశారు. 85వేల కేసులు నమోదయ్యాయి. ఈ వాస్తవాలను విస్మరించరాదు. వీటికి వ్యతిరేకంగా పోరాడాలి. ప్రభుత్వం అనుసరిస్తున్న మతతత్వ, ఫాసిస్టు అజెండాను ప్రతిఘటించాలన్నారు. ప్రొఫెసర్ రతన్‌లాల్ మాట్లాడుతూ, మనం ప్రతికూల పరిస్థితుల్లో జీవిస్తున్నాము. సామాజిక సంస్కరణలకోసం పోరాడాలి. ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదు. అన్యాయంపై తిరగబడాలి. రాజ్యం కల్పించిన హక్కులను ఉపయోగించుకొని స్వీయరక్షణ కోసం పోరాడాలి. సెక్యులరిజం మన ఆత్మ, దీన్ని నిర్వీర్యంచేస్తే మతరాజ్యం ఏర్పడుతుందని ఆయన అన్నారు.



సదస్సులో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

ప్రతిరోజు దళితులపై అత్యాచారాలు, హింసాకాండ నేటి వాస్తవమని బీకేఎంయూ ప్రధాన కార్యదర్శి గుల్జార్‌సింగ్ గొరియా ఆందోళన వ్యక్తం చేశారు. వీటి మూలకారణం మూడువేల సంవత్సరాల క్రితం అమలుచేసిన వర్ణవ్యవస్థ అని అన్నారు. మనిషి మనిషి మధ్య చీలికలు సృష్టించింది మనుస్మృతి. ఇలాంటి దురాగత పరిస్థితి ప్రపంచంలో మరెక్కడాలేదు. మానవ చరిత్రపై సాగించిననేరం ఇది. మానవహక్కుల పరిరక్షణ సార్వత్రిక తీర్మానంపై భారతదేశం సంతకంచేసింది. కులవిభజన అసమానతలు సృష్టించింది. ఇలాంటి దుర్మార్గాన్ని భరించరాదు. దిగువ కులాలుగా పేర్కొంటున్న జనంపై అగ్రకులాలు తమ పెత్తందారీ వైఖరిని ప్రదర్శిస్తున్నారు. దళితులు ఆర్థికంగావెనుకబడి ఉన్నారు. వారికి భూమి లేదు. చేయడానికి పనిలేదు. జీవనానికి భూస్వామిపై ఆధారపడవలసి వస్తోంది. సామాజికచైతన్యం తక్కువ. సమాజంలో ఎలాంటి గుర్తింపులేదు. అణగారిన తరగతుల ప్రజల సామాజిక, ఆర్థిక విముక్తికోసం పోరాడాలన్నారు. దళిత ఉద్యమాల నిర్వహణకు విశాల వేదికను ఏర్పాటు చేసుకోవలసిన అవసరం ఎంతైనాఉంది. తక్షణ పరిష్కారానికి చేపట్టవలసిన ఉద్యమాలకు ప్రజాస్వామ్యం,సెక్యులర్, వామపక్షశక్తులు, ట్రేడ్‌యూనియన్లు తమ మద్దతును ప్రకటించాలి. ఈ సమస్యలు నేడు పెద్దసవాలుగా నిలిచాయి. కేవలం దళితుల అభివృద్ధేకాదు ఆధునిక సమాజం మొత్తం అభివృద్ధి చెందవలసి ఉంది. గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు పోరాటాలను చేపట్టాలి. యువతలో ఆగ్రహంపెరగి ప్రతిఘటనకు సిద్ధమవుతున్నారు. అమానవీయ అత్యా చారాలను భరించేందుకు వారు ఏమాత్రం సిద్ధంగాలేరు. దళిత బాలికలు, మహిళలపై అత్యాచారాలు చేయడం అగ్రవర్ణాల హక్కులాగా భావిస్తున్నారు. మనం ఐక్యంగా ఈ సమస్యపై పోరాడాలి. సమస్యలను పరిష్కరించు కోకుండా ఎంత మాత్రం మౌనం వహించరాదు. ఈ సమస్యలపట్ల యువత పోరాటానికి సిద్ధమవుతున్నారు. గొంతుకలేని ప్రజలకు గొంతుకై నిలవాలి అని సదస్సు పిలుపునిచ్చింది.

ఎవరి ప్రయోజనంకోసం బ్యాంకులు?

దేశంలోని ప్రస్తుత సామాజిక, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో బ్యాంకుల విలీనం, నిర్వహణ, సెక్యూరిటీ, ద్రవ్యవిధానం దాని పర్యవసనాలపై సగటుజీవి భయాందోళనలో ఉన్నాడు. దేశ ఆర్థికవ్యవస్థకు బ్యాంకులే మూలాధారం. ద్రవ్య విధానం సజావుగా సాగాలన్నా, ప్రజలు పొదుపు బాట పట్టాలన్నా, వారి కష్టార్జితం వృద్ధి కావాలన్నా, అది భద్రంగా భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడాలన్నా బ్యాంకులే ప్రధానం. వ్యాపార, పారిశ్రామిక రంగాలకు ఆర్థికచేయూత లభించాలన్నా బ్యాంకులే కీలకం. ఆరోగ్యకరమైన ఆర్థిక వ్యవస్థకు బలమైన బ్యాంకులే పునాదులు. అటువంటి బ్యాంకింగ్ వ్యవస్థ దేశంలో ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో ఉంది. ముఖ్యంగా ప్రభుత్వరంగ బ్యాంకుల ఉనికి ప్రశ్నార్థకమైంది. ఇటీవల బ్యాంకింగ్ రంగంలో వెలుగుచూస్తున్న వరుస పరిణామాలు ఇందుకు నిదర్శనం. ఒక వైపు బ్యాంకుల మనుగడనే ప్రశ్నార్థకం చేస్తూ లాభాలను హరిస్తున్న మొండిబకాయిలు, మరోవైపు మోసగాళ్లతో చేతులు కలిపి దేశ ప్రతిష్ఠను దిగజారుస్తున్న ఇంటిదొంగలు, ఇంకోవైపు ప్రభుత్వ విధానాలు, బ్యాంకర్ల నిర్ణయాలతో దెబ్బతింటున్న ఖాతాదారుల విశ్వాసం, ఇంకా వేధిస్తున్న మూలధనం కొరత వెరసి బ్యాంకింగ్ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టాయి. ఇక బడా కార్పొరేట్ల మోసాలకు బ్యాంకుల్లోని ఉన్నతస్థాయి సిబ్బంది అండగా నిలబడటం, ప్రభుత్వాలు కార్పొరేటు కేటుగాళ్లపై ఉదాసీనవైఖరి, బడా పారిశ్రామికవేత్తలకు రుణభారం రైటాఫ్ చేయడంతో బ్యాంకుల నష్టాలు మరింతగా పెరిగాయి. భారత్‌లో బ్యాంకుల విలీనం కొత్తేమీ కాదు. ముందెన్నడూ ఇంత భారీ స్థాయిలో, కేవలం ప్రభుత్వరంగ బ్యాంకు(పీఎస్‌బీ)లకు మాత్రమే పరిమితమై విలీనప్రక్రియ చేపట్టలేదు. 1969 జులై 20న, 14 అతిపెద్ద వాణిజ్య బ్యాంకులను భారత ప్రభుత్వం జాతీయం చేసింది. వ్యవసాయం, చిన్నపరిశ్రమలు, ఎగుమతులు, పారిశ్రామికీకరణకు ఊతమిచ్చేందుకు, బలహీనవర్గాలను బలోపేతం చేసేందుకు ఆ చర్య తీసుకుంది. ఆ తర్వాత 1980లో ఆంధ్రాబ్యాంకు సహా మరో 13బ్యాంకులను కూడా జాతీయం చేశారు. భారత ఆర్థిక చరిత్రలో అతిప్రధానమైన విధానపరమైన నిర్ణయం ఇదే. బ్యాంకుల జాతీయం కన్నా ముందు భారత ఆర్థిక వ్యవస్థను భారీ కార్పొరేట్ సంస్థలే నియంత్రించేవి. డిపాజిటర్లకు ఎలాంటి రక్షణా ఉండేది కాదు. బ్యాంకుల జాతీయాకరణ, 1991లో చేపట్టిన తర్వాత బ్యాంకింగ్ వ్యవస్థ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా మారింది. వినియోగదారులు, పెట్టుబడిదారుల్లో విశ్వసనీయతను సంపాదించుకుంది. పీఎస్‌బీల సంఖ్య తగ్గిపోవడంతో మానవ వనరులు, ఉద్యోగకల్పన, ఆర్థికవృద్ధి వంటి వాటితోపాటు స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రతికూలతలు ఎదురవ్వొచ్చు. పీఎస్‌బీల విలీనం ఉద్దేశం ఏంటన్న దానిపై పూర్తి స్పష్టత లేదు. బ్యాంకులను లాభాల్లోకి రావడం కోసమో లేక పెట్టుబడుల అవసరాలు తీర్చేందుకు ఈ నిర్ణయం తీసుకోలేదు. స్వల్పకాలికంగా ఎదురయ్యే ప్రతికూలతల్లో ప్రధానమైనది మానవ వనరులపై ఆధారపడే ప్రభావమే. సంస్కృతిపరంగా, కార్య కలాపాలపరంగా ఆయా బ్యాంకుల మధ్య ఉండే తేడాలకు తగ్గట్లు సర్దుకుపోవడం ఉద్యోగుల వైఖరి ఎలా ఉంటుందన్నదాన్ని పరిగణనలోకి తీసుకోకుండా విలీన నిర్ణయం తీసుకున్నారు. ఎస్‌బీఐ, దాని అనుబంధ ప్రాంతీయ బ్యాంకుల విలీనంతో పోలిస్తే ఇప్పుడు జరగబోయే విలీనం పూర్తి భిన్నంగా ఉంటుంది. ఎస్‌బీఐ, దాని అనుబంధ బ్యాంకుల వ్యవహారాలు, సంస్థాగత నిర్మాణం ఒకేలా ఉండేవి. కానీ, ఇప్పుడు పీఎస్‌బీల విషయంలో అలా కాదు.

నిరర్థక ఆస్తులు, మొండి బకాయిల సమస్యలను నియంత్రించేందుకు, బ్యాంకుల సామర్థ్యాన్ని పెంచేందుకు విలీనం ఉపయోగపడుతుందా? అనేది మరో పెద్ద ప్రశ్న. ప్రపంచవ్యాప్తంగా ఒకదాని తరువాత మరొక ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతున్నప్పటికీ, మన దేశంలో బ్యాంకులు ప్రభుత్వ రంగంలో ఉండడంతో సంక్షోభం ప్రభావం కనిపించలేదు. ఒకవైపు అమెరికా తన ఆర్థిక వ్యవస్థను, కుప్పకూలిన బ్యాంకింగ్ రంగాన్ని కాపాడు కోవడానికి పెద్ద ఎత్తున బెయిల్ అవుట్ ప్యాకేజిలను ప్రకటిస్తున్న సమయంలో మన ఆర్థిక వ్యవస్థ నామమాత్రమైన నష్టంతో బయటపడింది. ఆ కాలంలో మన బ్యాంకులు లాభాలను ఆర్జించడంతో ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా నిధులను ఖర్చుచేశాయి. వ్యవసాయ రుణాలు పెద్దఎత్తున ఇవ్వడంతోపాటు చిన్న,మధ్య తరహా పరిశ్రమలకు భారీగా నిధులు అందుబాటులోకి తీసుకొచ్చాయి.

లక్ష్యాలను చేరాలన్న నిబంధనలు, పనిభారం, కిందిస్థాయి సిబ్బందితో తలనొప్పి, పైస్థాయిలో ఉన్న సిబ్బందికి కొత్త సాంకేతిక విషయంపై అవగాహన లేకపోవడం. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటాసైన్సు, అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీపై అవగాహన లేకపోవడం, పునశ్చరణ లేక అగమ్యగోచరంగా తయారైంది. వీటికి తోడు క్యాష్ లెస్ లావాదేవీలతో సైబర్ మోసాలు, ఓటీపీ ద్వారా నష్టపోయిన ఖాతాదారులు బ్యాంకులను సంప్రదించడం వంటి ప్రతికూలతల మధ్య పని చేయలేక చాల మంది మేనేజర్ పై స్థాయి వ్యక్తులు పది సంవత్సరాల సర్వీసు ఉండగానే వీఆర్ఎస్ ఇస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థికరంగ నిపుణులతో తక్షణమే కమిటీ వేసి బ్యాంకింగ్ వ్యవస్థను గాడిలో పెట్టవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

లోన్లు ఇవ్వని బ్యాంకర్లు..

పంటల సాగుకు బ్యాంకులు విరివిగా లోన్లు ఇవ్వాలని కలెక్టర్ బ్యాంకర్లను ఆదేశిస్తున్నా, ఏ బ్యాంక్ కూడా రైతులకు వంద శాతం పంట రుణాలు ఇవ్వడం లేదు. 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంటరుణాల కోసం రెండు తెలుగు రాష్ట్రాలలో 2,50,000 మందికి రూ. 6,400 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యం కాగా, 3,108 కోట్ల రుణాలను మాత్రమే ఇచ్చి 49శాతం లక్ష్యాన్ని సాధించారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 6,600.41 కోట్ల రుణాలు ఇవ్వాలనుకోగా ఇచ్చింది 54 శాతం. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయంపై సబ్సిడీలు తీసేసారు. వ్యవసాయ పరంగా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రైతుబంధు, రైతు భరోసా మినహా ఎటువంటి పథకాలు వర్తించడం లేదు. 'యంత్రలక్ష్మి', విత్తనాలు, ఎరువులు, పిండి సంచులు, వ్యవసాయ పరికరాలు, టార్పాలిన్లు, డ్రిప్, స్ప్రింక్లర్లు తదితరాలకు సబ్సిడీబంద్ పెట్టింది. దీంతో రైతులకు వీటిఖర్చులు కూడా భారంగా మారాయి. క్లస్టర్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని చెప్పి మూడు సంవత్సరాలవుతుంది కానీ ఇంతవరకు అమలు పరచలేదు. ఇప్పుడు డ్రోన్లు ఇస్తామని చెపుతున్నారు. ఇక సన్నకారు రైతులకు పథకాలు వర్తించడం లేదు. ప్యాక్‌హౌస్ లాంటివి ఇస్తున్నారు నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్, పౌల్ట్రీ, గేదల పెంపకానికి వివరంగా ప్రాజెక్ట్ నివేదిక ఇవ్వవలసి ఉంది. అలాగే రైతు ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ అయిఉండాలి. ఆర్‌బిఐ విడుదలచేసిన నివేదిక ప్రకారం దాదాపుగా అన్ని బ్యాంకులు నూరుశాతం లక్ష్యాలను సాధించాలి. ముఖ్యంగా బ్యాంకులలో పనిచేసే సిబ్బందికి మేనేజర్, పై స్థాయిలో పనిచేసే వారి పని మరింత సంక్లిష్టంగా మారింది.

లక్ష్యాలను చేరాలన్న నిబంధనలు, పనిభారం, కిందిస్థాయి సిబ్బందితో తలనొప్పి, పైస్థాయిలో ఉన్న సిబ్బందికి కొత్త సాంకేతిక విషయంపై అవగాహన లేకపోవడం. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటాసైన్సు, అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీపై అవగాహన లేకపోవడం, పునశ్చరణ లేక అగమ్యగోచరంగా తయారైంది. వీటికి తోడు క్యాష్ లెస్ లావాదేవీలతో సైబర్ మోసాలు, ఓటీపీ ద్వారా నష్టపోయిన ఖాతాదారులు బ్యాంకులను సంప్రదించడం వంటి ప్రతికూలతల మధ్య పని చేయలేక చాల మంది మేనేజర్ పై స్థాయి వ్యక్తులు పది సంవత్సరాల సర్వీసు ఉండగానే వీఆర్ఎస్ ఇస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థికరంగ నిపుణులతో తక్షణమే కమిటీ వేసి బ్యాంకింగ్ వ్యవస్థను గాడిలో పెట్టవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

డాక్టర్ యం.సురేష్‌బాబు, ప్రజాసైన్స్‌వేదిక అధ్యక్షులు

ఆదివాసీల హక్కులు హరించడమే

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అటవీ పరిరక్షణ నిబంధనలను జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది స్థానిక గ్రామసభ అధికారాలపై నీళ్లు చల్లడమేనని, దీనికితోడు ఆదివాసీల హక్కులను బలవంతంగా లాక్కోవడమేనని సోరెన్ విమర్శించారు. ఈ మేరకు ప్రధాని నరేంద్రమోదీకి హేమంత్ సోరెన్ శుక్రవారం లేఖ రాశారు. అటవీ పరిరక్షణ నిబంధనలు 2022లో మార్పులు చేయాలని మోదీకి ఆయన విజ్ఞప్తి చేశారు. వాస్తవంగా ఏ చట్టమైనా, నిబంధనలైనా దేశంలోని గిరిజనులు, ఆదివాసీల హక్కులు కాపాడేవిగా ఉండాలని, అందుకు అవసరమైన వ్యవస్థలు ఏర్పాటు చేయాలని సోరెన్ పేర్కొన్నారు. కేంద్రం తీసుకొచ్చిన నిబంధనలు ముమ్మాటికీ స్థానిక గ్రామసభ

- కొత్త అటవీ నిబంధనలపై సీఎం సోరెన్ ఆగ్రహం
- ప్రధాని మోదీకి లేఖ

అధికారాలను తగ్గించడమేనని, లక్షలాదిమంది అడవి బిడ్డలు ప్రత్యేకించి ఆదివాసీల హక్కులకు విఘాతం కలిగించడమేనని విమర్శించారు. ఇతర ప్రయోజనాల కోసం అటవీ భూములు వినియోగించుకోవడానికి ముందుగా గ్రామసభ అనుమతి తప్పకుండా తీసుకోవాలన్న నిబంధన ఎత్తివేయడం దారుణమని వ్యాఖ్యానించారు. యజమానుల అనుమతి లేకుండా చెట్ల నరికివేత అనేది దుర్మార్గమని పేర్కొన్నారు. ఓ

ముఖ్యమంత్రిగా 32 స్వదేశీ జాతుల అభిప్రాయాలను, హక్కులను ప్రధాని దృష్టికి తీసుకురావడం తన బాధ్యతని ఆయన లేఖలో తెలిపారు. తాజాగా తీసుకొచ్చిన నిబంధనలు అటవీ హక్కుల చట్టం-2006ను ఉల్లంఘించడమేనని వివరించారు. దేశవ్యాప్తంగా 20 కోట్లమంది ఆదివాసీలు అడవులపై ఆధారపడి జీవిస్తున్నారని, 10 కోట్లమంది వివిధ రూపాల్లో అటవీ భూముల సాగు ద్వారా జీవనం సాగిస్తున్నారని సోరెన్ వివరించారు. కొత్త నిబంధనుల కారణంగా తరతరాలుగా అడవులనే నమ్ముకొని జీవిస్తున్న ఆదివాసీల జీవితాలు దుర్భరమవుతాయని, అసలు వారికి హక్కులే ఉండవని పేర్కొన్నారు. అభివృద్ధి పేరుతో ఆదివాసీల సంప్రదాయ భూములను లాక్కుంటారని అనుమానం వెలిబుచ్చారు. అటవీ హక్కుల చట్టం 1980 కింద అటవీ భూముల మార్పిడికి అనుమతించవద్దని 2009లో పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వశాఖ స్పష్టంచేసిందని గుర్తుచేశారు.

కోర్టుల్లో ప్రాంతీయ భాషలకు ప్రాధాన్యత

కేంద్రమంత్రి కిరెన్ రిజిజు ఆశాభావం

చెన్నై: దేశవ్యాప్తంగా కోర్టుల్లో ప్రాంతీయ భాషల వినియోగానికి తన మద్దతు ఉంటుందని కేంద్ర న్యాయశాఖమంత్రి కిరెన్ రిజిజు శుక్రవారం చెప్పారు. కోర్టులపై ఒకే భాష రుద్దడానికి తాను పూర్తి వ్యతిరేకమని వ్యాఖ్యానించారు. తమిళనాడు డా.అంబేద్కర్ లా యూనివర్సిటీ 12వ వార్షికోత్సవంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. తమిళ భాషపై మంత్రి రిజిజు ప్రశంసలు కురిపించారు. 'మన సంస్కృతి, మన భాషతో పాటు దేశాన్ని ముందుకు తీసుకెళ్లడానికి మన ప్రధాని నరేంద్రమోదీ కట్టుబడి ఉన్నారు. ఈ విషయం మీ అందరికీ తెలుసు. దేశవ్యాప్తంగా రోజువారీ కోర్టు కార్యకలాపాలు ప్రాంతీయ భాషల్లోనే జరగాలని నేను కోరుకుంటున్నాను. భవిష్యత్‌లో ప్రాంతీయ భాషలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని నేను ఇప్పటికే భారత ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తులు, హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులకు చెప్పాను' అని మంత్రి రిజిజు తెలిపారు. హైకోర్టు, జిల్లా కోర్టులు, సబార్డినేట్ కోర్టుల్లో భవిష్యత్‌లో తమిళ భాషకు అధిక ప్రాధాన్యత ఇవ్వడాన్ని మనమంతా చూస్తామని, అప్పుడు అందరం గర్వపడతామని చెప్పారు. న్యాయస్థానాలపై ఒకే ఒక భాష రుద్దడానికి తాను పూర్తి వ్యతిరేకమన్నారు. వర్సిటీ చాన్సలర్, గవర్నరు ఆర్ఎన్ రవి, రాష్ట్ర న్యాయశాఖమంత్రి ఎస్.రఘుపతి, ఇతర ప్రముఖులు హాజరయ్యారు.

జి-20పై ప్రభుత్వానిది 'హైవోల్టేజ్ డ్రామా'

కాంగ్రెస్ విమర్శ

న్యూఢిల్లీ: భారత్ జి-20 అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన ఒకరోజు తర్వాత కాంగ్రెస్ పార్టీ శుక్రవారం మోదీ ప్రభుత్వంపై విమర్శలు చేసింది. అధ్యక్ష పదవి అనేది మారుతుండటం అనివార్యమని, అయితే ముందెన్నడూ ఈ బాధ్యత నిర్వహించిన దేశాలు చేయనివిధంగా కేంద్ర ప్రభుత్వం 'హై వోల్టేజ్ డ్రామా' ప్రదర్శిస్తుందని ఆరోపించారు. భారతదేశం గురువారం జి-20 అధ్యక్ష పదవిని చేపట్టింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మొత్తం మానవాళికి ప్రయోజనం చేకూరేలా 'ప్రాథమిక ఆలోచనా విధానం మార్పు' కోసం బలమైన ప్రదర్శన రూపొందించారు. దేశం 'ఏకత్వాన్ని' మరింత ప్రోత్సహించడానికి కృషి చేస్తుందని చెప్పారు. దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాలతో సహా అనేక కేంద్ర రక్షిత స్మారక చిహ్నాలు జి-20 లోగోతో విద్యుత్‌కాంతులీనాయి. కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్... ప్రభుత్వం పై దాడి చేస్తూ 20 అధ్యక్ష పదవి భ్రమణమని, భారత అధ్యక్ష పదవి అనివార్యమని అన్నారు. గతంలో జి-20 అధ్యక్ష పదవిని అమెరికా, బ్రిటన్, కెనడా, దక్షిణ కొరియా, ఫ్రాన్స్, మెక్సికో, రష్యా, ఆస్ట్రేలియా, టర్కీ చైనా, జర్మనీ, అర్జెంటీనా, జపాన్, సౌదీ అరేబియా, ఇటలీ, ఇండోనేషియా నిర్వహించాయని, అయితే ఏడాది పాటు జి-20 అధ్యక్ష పదవిని నిర్వహించనున్న భారతదేశం మాదిరిగా ఆ దేశాలు ఏవీ హై వోల్టేజ్ డ్రామాను ప్రదర్శించలేదు' అని రమేశ్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. 'గాంధీనగర్‌లో 5-4-2014లో ఎల్.కె.అద్వానీ ఏమన్నారో నేను గుర్తు చేస్తున్నాను. మోదీ ఒక అద్భుతమైన ఈవెంట్ మేనేజర్ అని పిలిచారు. జి-20 చుట్టూ అల్లుకున్నదీ అంతే' అని జైరాం రమేశ్ తెలిపారు.

అడ్డుకోవడం, జాప్యం, పక్కదారి పట్టించడం

ఇదే కాంగ్రెస్ సిద్ధాంతం: మోదీ

అహ్మదాబాద్: కాంగ్రెస్‌పై ప్రధాని నరేంద్రమోదీ విరుచుకుపడ్డారు. అడ్డుకోవడం, జాప్యం చేయడం, పక్కదారి పట్టించడంపైనే కాంగ్రెస్‌కు నమ్మకం ఎక్కువని విమర్శించారు. 'పేదలను దోచుకున్న వారు...అవినీతిని అంతం చేస్తున్న తనను నిందిస్తున్నారని చెప్పుకొచ్చారు. గుజరాత్‌లోని మెట్ట ప్రాంతాలకు నర్మదా నదీ జలాలు తీసుకొచ్చేందుకు గత కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏనాడు ఆసక్తి చూపలేదని, అవినీతికి అవకాశం ఉన్న పనులు మాత్రమే కాంగ్రెస్ చేసిందని మండిపడ్డారు. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బనస్కాంత జిల్లా కాంక్రేజ్ గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. గుజరాత్‌లోని వర్షాధార ప్రాంతాలకు నర్మదా నదీ జలాలను కాంగ్రెస్ పార్టీ ఏనాడైనా తీసుకొచ్చిందా అని మోదీ ప్రశ్నించారు. ఈ విషయం ఈ

ప్రాంతంలోని పెద్దలకు తెలుసని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలనలో ఆ పనిచేయలేకపోయారని నిందించారు. సర్దార్ సరోవర్ డ్యామ్ నిర్మాణాన్ని అడ్డుకోవడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని, వ్యాజ్యాల ద్వారా ఈ ప్రాజెక్టు పనులు సకాలంలో జరకుండా అడ్డుకుంటుందని చెప్పుకొచ్చారు. నర్మదా బచావో ఆందోళన్ కార్యకర్త మేధా పాట్కర్ ఉద్యమాలను ఆయన గుర్తుచేశారు. నర్మదా జలాలు రాకుండా అడ్డుకున్న కాంగ్రెస్‌ను బనస్కాంత జిల్లా ప్రజలు క్షమిస్తారా అని ప్రశ్నించారు. బనస్కాంత ఎడారిగా మారడానికి కాంగ్రెస్ కారణమని నిందించారు. అలాంటి కాంగ్రెస్‌ను కఠినంగా ఓటు ద్వారా శిక్షించాలని ప్రజలను కోరారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ దుర్మార్గాన్ని మర్చిపోరని తాను భావిస్తున్నట్లు చెప్పారు. డబ్బులు వచ్చే పనులు తప్ప ఇంకేమీ కాంగ్రెస్ నాయకులకు గుర్తు రాలేదన్నారు. కరువు, కాటకాల సమయంలో సహాయ పనుల్లోనూ లంచాలు తీసుకున్నారని చెప్పారు. కరువు ప్రాంతానికి నర్మదా జలాలు తీసుకొచ్చిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ హయాంలో వదిలేసిన నీటి సరఫరా పథకాలను లక్ష కోట్ల రూపాయలతో తమ ప్రభుత్వం పూర్తి చేసిందని నమ్మబలికారు.

అల్లర్ల కేసులో సోదరుడితో కలిసి

లొంగిపోయిన ఎస్పీ ఎమ్మెల్యే

ఇద్దరినీ అరెస్టు చేసిన పోలీసులు

కాన్పూర్: అల్లర్లు, గృహ దహనం కేసులో పరారీలో ఉన్న సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే ఇర్ఫాన్ సోలంకి, అతని తమ్ముడు శుక్రవారం పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు అధికారులు తెలిపారు. భూ వివాదం కేసులో నవంబర్ 8న నజీర్ ఫాతిమా ఇంట్లో అల్లర్లకు పాల్పడంతో పాటు గృహ దహనం చేసినందుకు ఇర్ఫాన్, అతని తమ్ముడు రిజ్వాన్ సోలంకిపై పోలీసులు కేసు నమోదు చేసినప్పటి ఈ ఇద్దరి కోసం వెతుకుతున్నారు. ఇర్ఫాన్, అతని సోదరుడు రిజ్వాన్ శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో తన ముందు లొంగిపోయారని, తరువాత వారిని పోలీసులు అరెస్టు చేశారని పోలీసు కమిషనర్ బి.పి.జోగ్దండ్ తెలిపారు. సిసమావు (కాన్పూర్‌లో) నుంచి ఎస్పీ ఎమ్మెల్యేగా ఉన్న ఇర్ఫాన్‌ను, అతని తమ్ముడిని శుక్రవారం కోర్టు ముందు ప్రవేశపెట్టినట్లు జోగ్దండ్ వివరించారు. సోదరులిద్దరినీ ఇక్కడి ఎంపీ-ఎమ్మెల్యే కోర్టులో హాజరుపరచగా, వారిని 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపినట్లు పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. పక్షం రోజుల క్రితమే వారిపై నాన్‌బెయిలబుల్ వారెంట్లు పొందామని డీసీపీ క్రైమ్, సల్మంతజ్ జాఫర్తాజ్ పాటిల్ విలేకరులతో అన్నారు. 2007లో తొలిసారిగా ఎన్నికయిన ఇర్ఫాన్ ఆర్య నగర్ నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన 2012, 2017, 2022 సార్వత్రిక ఎన్నికల్లో సిసమావు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కూడా గెలుపొందారు. అతని తండ్రి ముస్తాక్ సోలంకీ కూడా కాన్పూర్‌లోని ఆర్య నగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా ఉన్నారు. అల్లర్లు, దహనం చేసినందుకు ఇర్ఫాన్,

అతని తమ్ముడు, మరో నాలుగు డజన్ల మంది పై జాజ్మౌ పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, ఇర్ఫాన్ ఆరోపణలను ఖండిస్తూ ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ సతీష్ మహానా తనపై వచ్చిన ఆరోపణలను సరిగ్గా విచారించి న్యాయం జరిగేలా ఎమ్మెల్యేల కమిటీని ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. కాగా నకిలీ ఆధార్ కార్డుతో విమానం ఎక్కి విమానాశ్రయ భద్రతకు విఘాతం కలిగించినందుకు ఇర్ఫాన్ సోలంకిపై మంగళవారం మరో ఎఫ్ఐఆర్ నమోదయిందని జాయింట్ పోలీసు కమిషనర్ (శాంతిభద్రతలు) ఆనంద్ ప్రకాశ్ తివారీ తెలిపారు. సోలంకి నకిలీ ఆధార్ కార్డు పొందేందుకు సహకరించిన సీనియర్ మహిళా ఎస్పీ నాయకురాలు నూరీ షౌకత్, మరో ముగ్గురు... అమ్మర్ ఇలాహి అలియాస్ అలీ, అన్వర్ మన్సూరి, అక్తర్ మన్సూరీలతో సహా నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఎమ్మెల్యే అరెస్టు నుంచి తప్పించుకునేందుకు నకిలీ గుర్తింపు కార్డును ఉపయోగించి ఢిల్లీ నుంచి ముంబైకి వెళ్లినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆధార్ కార్డులో అతని ఫోటో ఉంది, కానీ అతని పేరు అష్రఫ్ అలీ అని పేర్కొనట్లు జేసీపీ తెలిపారు.

National Commission for Women, India

జడ్జీపై కఠిన చర్యలకు మహిళా కమిషన్ డిమాండ్

న్యూఢిల్లీ: తన కార్యాలయంలో ఓ మహిళతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న రోస్ అవెన్యూ కోర్టు జడ్జికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో ఈ వారం మొదట్లో చోటుచేసుకుంది. ఈ ఘటనపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) డిమాండ్ చేసింది సోషల్ మీడియాలో మంగళవారం వచ్చిన ఈ వీడియోను ఢిల్లీ హైకోర్టు నిషేధించింది. దీనిపై జాతీయ మహిళా కమిషన్ శుక్రవారం మాట్లాడుతూ రేస్ అవెన్యూ కోర్టు జడ్జికి సంబంధించిన అభ్యంతరకమైన వీడియోపై తమకు ఫిర్యాదు వచ్చిందని పేర్కొంది. 'ఈ విషయాన్ని కమిషన్ తీవ్రంగా పరిగణించింది. తక్షణమే అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖా శర్మ ఢిల్లీ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు లేఖ రాశారు' అని ఎన్‌సీడబ్ల్యూ తెలిపింది. వారంలోపు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. దీనిపై జస్టిస్ యశ్వంత్ వర్మ మాట్లాడుతూ ఘటనను హైకోర్టు తీవ్రంగా పరిగణిస్తోందని, సామాజిక మాధ్యమాల్లో వీడియోను నిషేధించేలా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే కోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఆదేశించారని ఆయన పేర్కొన్నారు.

పార్లమెంట్ సమావేశాల్లో 16 బిల్లులు!

న్యూఢిల్లీ: డిసెంబరు 7న ప్రారంభం కానున్న పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో బహుళ రాష్ట్ర సహకార సంఘాల్లో జవాబుదారీతనం, ఎన్నికల ప్రక్రియను సంస్కరించడంతో సహా 16 కొత్త బిల్లులను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం ప్రణాళిక చేసింది. దంత వైద్యుల చట్టం-1948 రద్దు కోసం ఒక జాతీయ డెంటల్ కమిషన్ ఏర్పాటు కోరుతూ జాతీయ డెంటల్ కమిషన్ బిల్లును కూడా ఈ సమావేశాల్లో తీసుకురావాలన్నది ప్రభుత్వ అజెండాలో ఉంది. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ చట్టం-1947ను రద్దు చేసి నేషనల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ కమిషన్ (ఎన్ఎన్ఎంసీ) ఏర్పాటు కోసం నేషనల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ కమిషన్ బిల్లు తీసుకురావాలని ఆరోగ్య మంత్రిత్వ శాఖ యోచిస్తున్నది. గురువారం విడుదల చేసిన లోక్‌సభ బులెటిన్ ప్రకారం... బహుళ-రాష్ట్ర సహకార సంఘాల (సవరణ) బిల్లు-2022 పాలనను బలోపేతం చేయడం, పారదర్శకతను పెంపొందించడం, జవాబుదారీతనం పెంచడం, ఇప్పటికే ఉన్న చట్టాన్ని భర్తీ చేయడం, 97వ రాజ్యాంగ సవరణలోని నిబంధనలను చేర్చడం, బహుళ-రాష్ట్ర సహకార సంఘాలలో ఎన్నికల ప్రక్రియను సంస్కరించడం వంటి లక్ష్యంతో ప్రవేశపెట్టబడింది. బహుళ రాష్ట్ర సహకార సంఘాల కోసం నిర్వహణా యంత్రాంగాన్ని మెరుగుపరచడం, సులభంగా వ్యాపారం చేయడం కూడా దీని లక్ష్యం. డిసెంబరు 29న ముగిసే సమావేశాల్లో కంటోన్మెంట్ బిల్లు-2022ను తీసుకురావాలని ప్రభుత్వం ప్రతిపాదించిన మరో ముసాయిదా చట్టం. కంటోన్మెంట్ బిల్లు కంటోన్మెంట్ల పరిపాలనకు సంబంధించినది. ఇది ఎక్కువ ప్రజాస్వామ్యం, ఆధునికీకరణ, సామర్థ్యాన్ని అందించడానికి ఉద్దేశించినది. దేశవ్యాప్తంగా ఉన్న మునిసిపాలిటీలకు

అనుగుణంగా మరింత అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి కూడా ఇది ప్రయత్నిస్తుంది. కంటోన్మెంట్లలో 'సౌలభ్యం' కల్పించాలని కూడా బిల్లు ఉద్దేశించింది. జాబితాలోని మరొక బిల్లు పాత గ్రాంట్ (నియంత్రణ) బిల్లు, 2022. అలాగే 1836, 1827, 1838, 1849 మరియు 1851 గవర్నర్ జనరల్ ఆర్డర్ల కింద ఇచ్చిన భూమిని వాటి బదిలీ, ఉపవిభజన, ప్రయోజనం మార్పుతో సహా నియంత్రించడం ఈ బిల్లు ఉద్దేశం. అటువంటి భూమి మెరుగైన నిర్వహణ కోసం అధికారాలను అప్పగించాలని కూడా ఇది ప్రయత్నిస్తుంది. భూమిపై ప్రభుత్వ హక్కులను సమర్థవంతంగా పరిరక్షించడంతోపాటు జీవన సౌలభ్యాన్ని పెంపొందించడం ఈ బిల్లు లక్ష్యం. అటవీ (సంరక్షణ) సవరణ బిల్లు అటవీ (సంరక్షణ) చట్టం-1980ని సవరించడానికి ప్రయత్నిస్తుంది. చట్టంలోని నిబంధనల వర్తింపులో అస్పష్టతను తొలగించడం, అటవీయేతర ప్రాంతాల్లో మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించడం, అడవులను సంరక్షించడం వంటి అంశాలను కూడా ఇది సూచిస్తుంది. ప్రభుత్వం తీసుకురావాలని ప్రతిపాదించిన కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ (సవరణ) బిల్లు-2022 తీరప్రాంతాలలో పర్యావరణ పరిరక్షణ ప్రధాన సూత్రాలను పలచన చేయకుండా వాటాదారులకు నియంత్రణ సమ్మతి భారాన్ని తగ్గించడానికి ప్రధాన చట్టంలోని నిబంధనలను సవరించాలని కోరింది. ఇది చట్టం కింద నేరరహితం చేయాలని, అన్ని తీరప్రాంత ఆక్వాకల్చర్ కార్యకలాపాలను దాని పరిధిలోకి తీసుకురావడానికి చట్టం పరిధిని విస్తరించాలని కూడా ప్రతిపాదిస్తుంది. సమర్థవంతమైన అమలు కోసం చట్టంలోని ఇబ్బందులు, నియంత్రణ అంతరాలను తొలగించడం, వ్యాపారాన్ని సులభతరం చేయడం కూడా దీని లక్ష్యం.

8 నుంచి సోరెన్ సర్కారు విజయోత్సవ ర్యాలీలు

రాంచి: గడచిన మూడేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జార్ఖండ్‌లోని పాలక యూపీఏ భాగస్వామ్య పార్టీలు-జేఎంఎం, కాంగ్రెస్, ఆర్‌జేడీ నిర్ణయించాయి. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించాలని తీర్మానించాయి. ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకోవడానికి ర్యాలీలు దోహదపడతాయని మంత్రి ఒకరు శుక్రవారం చెప్పారు. హేమంత్ సోరెన్ నాయకత్వంలోని యూపీఏ ప్రభుత్వం అధికారం చేపట్టి డిసెంబరు 29నాటికి మూడేళ్లు పూర్తి కావస్తుంది. డిసెంబరు 8వ తేదీ నుంచి ర్యాలీలు ప్రారంభించాలని నిర్ణయించామని జేఎంఎం అధికార ప్రతినిధి వినోద్ పాండే పీటీఐకి చెప్పారు. సీఎం సోరెన్ అధ్యక్షతన గురువారం సాయంత్రం జరిగిన యూపీఏ సమావేశంలో ర్యాలీలు జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రచారానికి సంబంధించి పూర్తిస్థాయి కార్యక్రమాన్ని రూపొందిస్తున్నామని, త్వరలోనే ప్రకటిస్తామని పాండే వివరించారు. ఖతియానీ జోహార్ యాత్ర పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు పాలక సంకీర్ణ వర్గాలు వెల్లడించాయి. హేమంత్ సోరెన్ ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళతామని తెలిపాయి. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన అర్హులకు ఇంటి స్థలాల పంపిణీ, ఓబీసీలకు 27శాతం రిజర్వేషన్లు అమలు, పాత పెన్షన్ విధానం, రైతులకు రుణమాఫీ వంటి అనేక అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. యూపీఏ భాగస్వాములంతా ప్రతి జిల్లాలో జరిగే ర్యాలీలో పాల్గొంటారని రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి అలంగిర్ ఆలం పీటీఐకి చెప్పారు. ర్యాలీల్లో ముఖ్యమంత్రి, ఇతర కీలక నేతలు పాల్గొంటారన్నారు.

కూలిన సున్నపురాయి గని... ఏడుగురి మృతి

జగదల్‌పూర్: సున్నపురాయి గనిలో ఓ భాగం కూలిపోవడంతో ఏడుగురు వ్యక్తులు మృతి చెందారు. ఈ ఘటన చత్తీస్‌గఢ్‌లోని బస్తర్ గ్రామంలో శుక్రవారం జరిగినట్టు పోలీసులు తెలిపారు. మృతిచెందిన వారిలో ఆరుగురు మహిళలు ఉన్నారు. ఈ ఘటన జిల్లా మండల కేంద్రంమైన జగదల్‌పూర్‌కు 12 కిలోమీటర్ల దూరంలో, నగర్‌నార్ పోలీసుస్టేషన్ ప్రాంతంలోని, మాల్‌గావ్‌లో చోటుచేసుకున్నది పేర్కొన్నారు. 'బాధితులు గనిలో తవ్వకాలు జరుపుతున్న సమయంలో ఈ ఘటన జరిగిందనీ, శిథిలాల కింద చిక్కుకుపోయారని వివరించారు. సమాచారం తెలుసుకున్న వెంటనే పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు ఆస్పత్రికి తరలించే మధ్యదారిలో మరణించినట్టు వివరించారు. ప్రాథమిక సమాచారం బట్టి తవ్వకాలు జరుగుతున్న సమయంలో కేవలం ఏడుగురు మాత్రమే ఉన్నారని, తవ్వకాలు పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

పార్లమెంట్ సమావేశాల్లో వ్యూహ రచనకు

నేడు కాంగ్రెస్ నాయకుల సమావేశం

న్యూఢిల్లీ: డిసెంబరు 7న ప్రారంభమయ్యే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు పార్టీ ఎలాంటి వ్యూహాన్ని అనుసరించాలనే దానిపై చర్చించేందుకు కాంగ్రెస్ నాయకులు శనివారం సమావేశం కానున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో పార్టీ నాయకుడు అధిర్ రంజన్ చౌదురి, రాజ్యసభలో పార్టీ చీఫ్ విప్ జైరాం రమేశ్, లోక్‌సభలో పార్టీ చీఫ్ విప్ కె.సురేశ్ ఈ మేరకు వ్యూహాన్ని రూపొందించేందుకు శనివారం పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ నివాసంలో సమావేశం కానున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. అలాగే కేంద్ర మాజీ మంత్రులు పి.చిదంబరం, మనీశ్ తివారీ కూడా కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సనగా ఉన్న సోనియా గాంధీకి చెందిన 10, జన్‌పథ్ నివాసంలో జరిగే సమావేశానికి హాజరుకావచ్చు. కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఖర్గే బాధ్యతలు స్వీకరించిన తర్వాత జరుగుతున్న పార్లమెంటు తొలి సమావేశాలు ఇవే కావడం విశేషం.

దివ్యాంగుల సాధికారతకు కృషి చేసిన వారికి

జాతీయ అవార్డులు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వికలాంగుల సాధికారత కోసం విశేష కృషి చేసినందుకు శనివారం జాతీయ అవార్డులను ప్రదానం చేయనున్నారు. వికలాంగుల సాధికారత కోసం కృషి చేసిన వ్యక్తులు, సంస్థలు, రాష్ట్ర/జిల్లా మొదలైన వాటికి ఈ అవార్డులను అందజేయనున్నట్లు సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. 2022 సంవత్సరానికి, అవార్డు కోసం మొత్తం 1,210 దరఖాస్తులు వచ్చాయి. ఎంపిక ప్రక్రియలో దరఖాస్తుదారులు సమర్పించిన పత్రాలు, రికార్డులు పరిశీలనలో ఉన్నాయి. ఈ దరఖాస్తులను స్క్రీనింగ్ కమిటీలు పరీక్షించి ఎంపిక చేశాయని పేర్కొంది. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా, వికలాంగుల సాధికారత విభాగం (దివ్యాంగజన్), సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఏటా జాతీయ అవార్డులను అందజేస్తోంది.

వృద్ధురాలిపై అత్యాచారానికి 10 ఏళ్ల శిక్ష

మంగళూరు: ఓ వృద్ధురాలిని బెదిరించి మంగళసూత్రం, చెవి పోగులు, డబ్బు దోచుకోవడమే కాకుండా, ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డ 30 ఏళ్ల వ్యక్తికి ఉడుపి జిల్లా సెషన్స్ కోర్టు 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష అమలు చేయాలని ఆదేశించింది. నిందితుడు శివమొగ్గకు చెందిన ఇర్ఫాన్ (30) కాగా, జడ్జి దినేశ్ జైలు శిక్షతో పాటు రూ.50వేల జరిమానా కూడా విధించారు. తమిళనాడుకు చెందిన వృద్ధ మహిళ 40 ఏళ్లుగా ఉడిపిలో నివాసం ఉంటున్నారు. చెత్తను ఏరుకుని, దానిని డీలర్లుకు విక్రయిస్తుంటుంది. అనంతరం శ్రీ కృష్ణ మఠంలో తలదాచుకుంటుంది. మఠం ఎదురుగా చికెన్ దుకాణంలో పనిచేస్తున్న ఇర్ఫాన్, వృద్ధురాలిపై లైంగిక దాడి చేసి, ఆమెకు చెందిన బంగారు ఆభరణాలను దోచుకుని పారిపోయాడు. ఈ ఘటన 2017లో జరిగింది. వృద్ధురాలిని ఉడిపి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మహిళా పోలీసులు ఈ ఘటనపై మహిళ నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేశారు. ఓ హత్య కేసులో ఇర్ఫాన్ శిక్ష అనుభవిస్తున్న బెంగళూరు జైలు నుంచి నుంచి వారెంట్ తీసుకున్న పోలీసులు ఇర్ఫాన్‌ను తమ కస్టడీలోకి తీసుకున్నారు. 2018లో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఏప్రిల్ 2022లో కోర్టు వాదనలు వినడం ప్రారంభించింది. మొత్తంగా 18మంది సాక్షులను విచారణ చేసిన అనంతరం కోర్టు నిందితుడు తప్పుచేసినట్టు గుర్తించింది.

సాంకేతిక సమస్యతో దోహా విమానం నిలిపివేత

చెన్నై: దోహాకు 139మంది ప్రయాణికులతో వెళ్లే ప్రైవేట్ విమానం సాంకేతిక సమస్య ఎదుర్కోవడంతో వెనక్కి తిరిగి వచ్చిందని విమానాశ్రయ అధికారులు శుక్రవారం తెలిపారు. కతార్ ఎయిర్‌వేస్‌కు చెందిన విమానం టేకాఫ్ అయ్యేందుకు సిద్ధమైన తరుణంలో సాంకేతిక సమస్యను గుర్తించగా, వెనక్కి వచ్చేందుకు పైలెట్ అనుమతి అడినట్టు అధికారులు వివరించారు. విమానంలో ఉన్న ప్రయాణికులకు నగరంలోని హోటళ్లల్లో ఉండేందుకు అవకాశం కల్పించారు. సాంకేతిక సమస్యను పరిష్కరించిన తరువాత వారందరినీ గమ్యస్థానాలకు తరలించారు. మొత్తంగా విమానంలో ఐదుగురు క్రూ సభ్యులుండగా, ఈ ఘటనపై కతార్ ఎయిర్‌వేస్ స్పందించలేదు.

ప్రొఫెసర్‌కు హనీట్రాప్... వ్యక్తిని అరెస్ట్ చేసిన సీబీఐ

న్యూఢిల్లీ: కాలిఫోర్నియా యూనివర్సిటీలో ఎకనామిక్స్ ప్రొఫెసర్‌ను బ్లాక్‌మెయిల్ చేసి 48వేల డాలర్లు ఇవ్వాలని, లేని పక్షంలో మహిళతో ఉన్న అసభ్యకరమైన వీడియో చాట్‌లను బయటపెడతానని బెదిరించి, బ్లాక్ మెయిల్ చేసిన వ్యక్తిని సీబీఐ అరెస్టు చేసింది. ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ నుంచి వచ్చిన సమాచారం ఆధారం సీబీఐ ఢిల్లీలోని అసోలాలో నివసిస్తున్న రాహుల్ కుమార్‌ను అరెస్టు చేసింది. అయితే ఫేస్‌బుక్ చాట్‌లో అసభ్యకరమైన వీడియోలను పంపేలా ప్రొఫెసర్‌ను ప్రలోభపెట్టిన మహిళ కోసం అన్వేషణ కొనసాగుతోందని వారు తెలిపారు. ఫేస్‌బుక్ ద్వారా చాటింగ్ చేస్తున్న మహిళ, సోషల్ మీడియా సర్వీస్ చాట్ ప్లాట్‌ఫామ్‌లో ప్రముఖ యూనివర్సిటీకి చెందిన ఎకనామిక్స్ ప్రొఫెసర్‌తో స్నేహం చేసిందని వారు తెలిపారు. తన భాగస్వామి రాహుల్ కుమార్‌తో కలిసి కుట్ర చేసి, ఆమె సంభాషణలను లైంగిక అర్థాల వైపు మళ్లించిందనీ, చివరికి సెప్టెంబర్ 10, 2021న అసభ్యకరమైన వీడియోను రికార్డ్ చేసి పంపమని ప్రొఫెసర్‌ని కోరిందని వారు తెలిపారు. ఒక వీడియో అందిన తర్వాత, ఆమె తన బాయ్‌ఫ్రెండ్ రాహుల్ వీడియోను రికార్డ్ చేసినట్లు ప్రొఫెసర్‌తో చెప్పిందని వారు తెలిపారు. యూనివర్సిటీలోని అధికారులకు, అమెరికాకు చెందిన కొంతమంది ప్రముఖ జర్నలిస్టులకు వీడియోను పంపుతామని యుఎస్‌కు చెందిన ప్రొఫెసర్‌ను బెదిరింపులతో ఇద్దరూ బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించారని వివరించారు. ఈ బ్లాక్‌మెయిల్ సంవత్సరం సాగిందనీ, ఈ సమయంలో రాహుల్ పేపాల్ ఖాతాకు పదే పదే డబ్బు బదిలీ అయిందని వివరించారు. బాధితుడి నుంచి 48వేల అమెరికన్ డాలర్లు (సుమారు రూ. 38 లక్షలు) అందాయని వారు పేర్కొన్నారు.

ఎన్‌సీబీసీ చైర్‌పర్సన్‌గా మాజీ కేంద్రమంత్రి హన్స్‌రాజ్ ఆహిర్



న్యూఢిల్లీ: జాతీయ వెనుకబడిన వర్గాల కమిషన్‌కు మాజీ కేంద్రమంత్రి హన్స్‌రాజ్ ఆహిర్ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల అభ్యున్నతి తాను కృషి చేయనున్నట్టు హన్స్‌రాజ్ తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పదవిలో సవాళ్లతో బాధ్యతలు కూడా ఉన్నాయనీ, సమాజంలో వెనుకబడిన వర్గాలను అభివృద్ధిలోకి తీసుకువస్తానని ఆయన వివరించారు. 'ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు 'సబ్‌కాసాత్... సబ్‌కా వికాస్... సబ్‌కా విశ్వాస్' తన మెదడులోనే ఉందని, సమాజంలో వెనుకబడినన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తా' అని తెలిపారు. ప్రస్తుతం హన్స్‌రాజ్ ఆహిర్ (68) హోంశాఖ సహాయమంత్రిగా, రసాయన, ఎరువుల శాఖ సహాయమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

మోదీ... జగన్‌ను గద్దె దించేందుకు సమాయత్తం కావాలి

పార్టీ శ్రేణులకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: మోదీ, జగన్‌ను గద్దె దించేందుకు సమాయత్తం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పై పోరాటానికి భారత కమ్యూనిస్టు పార్టీకి చెందిన ప్రతి కార్యకర్త ఒక సైనికుడై పోరాడాలని అన్నారు. శుక్రవారం కావలిలోని ఓ కళ్యాణ మండపంలో జరిగిన సీపీఐ నెల్లూరు జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ దేశాన్ని మతతత్వ శక్తులు పాలిస్తున్నాయని, వారిని గద్దె దింపేందుకు సమాయత్తం కావాలని అన్నారు. ఎందరో అమరవీరుల త్యాగాల ఫలితంగా భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని, ఆ తరుణంలోనే ఎన్నో పోరాటాలు చేసి ప్రభుత్వ రంగ సంస్థలను స్థాపించుకున్నట్లు తెలిపారు. అయితే నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజాతంత్ర వాదులంతా ఏకమై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన సమయం ఆసన్నమైనదని రామకృష్ణ అన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే టిడ్కో ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రెండేళ్ల క్రితం టిడ్కో ఇళ్లు ఏ విధంగా ఉన్నాయో నేటికీ అదే పరిస్థితుల్లో ఉన్నాయని, అయితే రాష్ట్ర ప్రభుత్వం కేవలం వాటికి పైన రంగులు వేసి ప్రజలను మోసం చేస్తోందని రామకృష్ణ అన్నారు. టిడ్కో ఇళ్ల కోసం లబ్ధిదారులు గత ఐదు సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నా ముఖ్యమంత్రి అంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైనదని కాదని, అందుకే సీపీఐ నాయకత్వంలో ఈనెల 5న రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఉద్యమాన్ని చేపట్టినట్లు చెప్పారు. ఇది ప్రభుత్వానికి ఒక ఆరంభ హెచ్చరిక మాత్రమేనని, లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లను పూర్తిస్థాయిలో అందించేంతవరకు రాజీలేని పోరాటం చేస్తామని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్ మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో జరిగిన పార్టీ జాతీయ మహాసభలలో తీసుకున్న నిర్ణయాలను వివరించారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సీపీఐ పట్ల ప్రజలు ఎంతో విశ్వాసంతో ఉన్నారని, ఇటీవల విజయవాడలో జాతీయ మహాసభలే అందుకు నిదర్శనమని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో గ్రామస్థాయి నుంచి పార్టీ అనుబంధ సంఘాలుగా ఉన్న యువజన, మహిళ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలను బలోపేతం చేసుకుంటూ తద్వారా పార్టీని కూడా అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత మన పైన ఉందని అన్నారు. ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శి దామ అంకయ్య అధ్యక్షత వహించగా కార్యవర్గ సభ్యులు మధు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సీపీఐ సీనియర్ నాయకులు పముజుల దశరథరామయ్య, వి.రామరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు మాలకొండయ్య, సురేష్, సిరాజ్, రమణయ్య, చిన్న అంకయ్య, షానవాజ్, మధు, మహిళా సంఘం నాయకురాలు వినోదమ్మ, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి విజయ్ కుమార్, సౌత్ మోపూర్ ఉప సర్పంచి చల్ల నరసయ్య, ఏఐటీయూసీ గౌరవాధ్యక్షులు కె.ఆంజనేయులు, భవ నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ముక్తియార్, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా తదితరులు పాల్గొన్నారు.

నారాయణ ప్రచారం

సీపీఐ అభ్యర్థుల విజయం కోసం

న్యూఢిల్లీ: ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ శుక్రవారం విస్తృత ప్రచారం చేశారు. ప్రచారంలో భాగంగా 64వ డివిజన్ కేశవపురంలో భారీ ర్యాలీ నిర్వహించారు. నారాయణతో పాటు సీపీఐ ఢిల్లీ కార్యదర్శి దినేశ్ వర్షిణీ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు అజయ్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు. 64వ డివిజన్ సీపీఐ అభ్యర్థిగా కార్మిక నాయకుడు, ఇంజినీర్ సంజీవ్ కుమార్ రాణా పోటీ చేస్తున్నారు. సీపీఐ ర్యాలీకి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. సీపీఐ నేతలు శశికుమార్, బబన్‌కుమార్ సింగ్, ముస్లిం మొహమ్మద్ ప్రచారంలో పాల్గొన్నారు. 30వ డివిజన్‌లో ర్యాలీకి సీపీఐ ఉత్తర ఢిల్లీ జిల్లా కార్యదర్శి వివేక్ శ్రీవాస్తవ నాయకత్వం వహించారు. ఈ డివిజన్ నుంచి పార్టీ అభ్యర్థిగా సజ్దా బేగం పోటీ చేస్తున్నారు. 136వ డివిజన్ ప్రచారంలో సీపీఐ ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మధు విహార్, దాలిప్ తదితరులు పాల్గొన్నారు. ఇక్కడ నుంచి రింకూ దేవి పోటీ చేస్తున్నారు. సీపీఐ అభ్యర్థులకు వామపక్ష పార్టీలు మద్దతు ప్రకటించాయి.

జగన్ సైకోలా ప్రవర్తిస్తున్నాడు

- టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ధ్వజం
- నిడదవోలులో టీడీపీ 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' కార్యక్రమం
- కొవ్వూరులో మహిళలతో మాటామంతి

విశాలాంధ్ర-నిడదవోలు/కొవ్వూరు: ఒక సైకో చేతిలో రాష్ట్రం సర్వనాశనమైపోతుంటే కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు అన్నారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో శుక్రవారం టీడీపీ అధ్వర్యంలో నిర్వహించిన 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు నుంచి నిడదవోలు వరకు చంద్రబాబు భారీ రోడ్ షో నిర్వహించారు. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రానికి పట్టిన ఐదేళ్ల శనిని వదిలించుకునేందుకు ప్రజలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సైకో చేతిలో రాష్ట్రం సర్వ నాశనం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక సైకో ఊరికో సైకోని తయారు చేస్తున్నాడని, వైసీపీ సైకోలను భూ స్థాపితం చేసే వరకూ తాను పోరాడుతానని స్పష్టం చేశారు. ఇంత నీచమైన ముఖ్యమంత్రిని నా రాజకీయ జీవితంలో ఎప్పుడూ చూడలేదని, సైకో దెబ్బకు కంపెనీలన్నీ రాష్ట్రం నుంచి తరలిపోతున్నాయని అన్నారు. అమరరాజా బ్యాటరీస్ రూ.9,500 కోట్లు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు అక్కడి ప్రభుత్వంతో ఎంవోయూ చేసుకుందని తెలిపారు. ఇలా అయితే, రాష్ట్రంలోని యువతకు ఉద్యోగాలు ఎలా వస్తాయని ప్రశ్నించారు. పోలవరం పూర్తి చేయాలని రాత్రి, పగలు పని చేశానని, రైతులకు నీరు ఇచ్చేందుకు ఎంతో దూరదృష్టితో వ్యవహరించానని చెప్పారు. కానీ ఈ సీఎం పోలవరాన్ని గోదావరిలో కలిపేశారు. రాష్ట్ర భవిష్యత్తు నాశనమవుతుందని అన్నారు. యువత భవిష్యత్తును కాపాడేందుకు ఇక్కడకు వచ్చానని అన్నారు.

కొవ్వూరులో మహిళలతో మాటామంతి కార్యక్రమం

గురువారం రాత్రి తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులోని సాయి కళ్యాణ మండపంలో బస చేసిన చంద్రబాబు శుక్రవారం ఉదయం సాయి కళ్యాణ మండపంలో మహిళలతో మాటామంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ సీఎం జగన్ సైకోలో ప్రవరిస్తున్నాడని, జగన్ పాలనలో ఎక్కడా డ్వాక్రా మహిళల అభివృద్ధి కోసం మాట్లాడకపోవడమే నిదర్శనం అన్నారు. నిన్న కాక మొన్న ప్రధాని మోదీ డ్వాక్రా సంఘాలు చంద్రబాబు హయాంలోనే మొదలయ్యాయని పేర్కొనడాన్ని ఆయన గుర్తు చేశారు. దీపం పథకం, సున్నా వడ్డీకి రూ.ఐదు లక్షల రుణం ఇతరత్రా పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిన ఘనత తెలుగుదేశానికే దక్కుతుందన్నారు. ఆనాడు ఎన్టీఆర్ మహిళల సంక్షేమం కోసం స్థానిక సంస్థలలో 9 శాతం రిజర్వేషన్లు ఇవ్వగా, తాను విద్యాఉద్యోగాలలో 33 శాతం రిజర్వేషన్ అమలు చేశానని తెలిపారు. సీఎం జగన్ ప్రతి కుటుంబానికి ఇస్తున్న తాయిలాలు వారి కనీస సౌకర్యాలకు అయ్యే భారం 100 రెట్లుగా ఉందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశం అంటుతున్నా పట్టించుకోని పనికిమాలిన ప్రభుత్వం అని ధ్వజమెత్తారు. గతంలో తాను పాదయాత్ర చేస్తున్న సమయంలో మహిళలు పడుతున్న కష్టాలు చూసి ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేసి ఆడవారి ఆత్మ గౌరవం పేరిట అమలు చేశారన్నారు. దీనికి విరుద్ధంగా జగన్ వాటిపై పన్ను సైకో వలె ప్రవర్తిస్తున్నాడని విమర్శించారు. తమ హయాంలో విద్యా సంస్కరణల వల్ల మహిళలు చదువులో ఉన్నత స్థాయికి చేరారని తెలిపారు. దీంతో వరకట్నం సమస్య పోయి రివర్సు కట్నం వచ్చిందన్నారు. నేను కట్టించి ఇచ్చిన ఇళ్లకు వైసీపీ రంగులు వేసుకోవడం పట్ల ఆక్షేపణ వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని, కొవ్వూరు మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ పాల్గొన్నారు.

పేదలపై బీజేపీ మొసలి కన్నీరు

నవీన్ పట్నాయక్ నిప్పులు

బర్గడ్(ఒడిశా): ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీపై ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శుక్రవారం నిప్పులు చెరిగారు. అబద్ధాలు చెప్పడం ద్వారా ప్రజలపై బీజేపీ మొసలి కన్నీరు కారుస్తోందని మండిపడ్డారు. ప్రజలను తప్పుదారి పట్టించడం ఆపాలని కమల దళానికి హితవు పలికారు. పదంపూర్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక సందర్భంగా జరిగిన ఎన్నికల ప్రచారంలో నవీన్ పట్నాయక్ మాట్లాడారు. ఉప ఎన్నికలకు నవీన్ పట్నాయక్ ఎన్నికల ప్రచారం చేయడం ఇదే మొదటిసారి. ప్రసంగానికి ముందు ప్రముఖ ఒడియా కవి గంగాధర్ మెహర్‌కు ఆయన నివాళి అర్పించారు. పట్నాయక్ తన ప్రసంగంలో ప్రధానంగా బీజేపీని లక్ష్యంగా చేసుకున్నారు. పేదలకు సంబంధించిన పీఎంఏవై వంటి పథకాలను సైతం బీజేపీ రాజకీయం చేస్తోందని సీఎం ఆరోపించారు. పీఎంఏవై(గ్రామీణం) కింద ఏడాదికి రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షల ఇళ్లు నిర్మించినప్పటికీ బీజేపీ ఎంపీలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కేంద్రం నుంచి వచ్చే నిధులకు అడుగడుగునా అడ్డుపడుతున్నారని విమర్శించారు. దీనివల్ల పది లక్షల మంది పేదలకు అన్యాయం జరిగిందన్నారు. తన ప్రసంగం మొత్తంలో ఒక్కసారి కూడా ఆయన కాంగ్రెస్ పేరు ప్రస్తావించలేదు. మెహర్, కుల్ట్, యాదవ్, తెలీ సామాజిక వర్గ నేతలను ఆయన స్వయంగా కలిసి మద్దతు కోరారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు తీసుకున్నారు. గిరిజనుల ప్రాతినిధ్యం అధికంగా గల పదంపూర్లో రైతులు, గిరిజనులు, మహిళల సమస్యల పరిష్కారానికి బీజేడీ ఎంతగానో కృషి చేసిందని పట్నాయక్ చెప్పారు. ఇక్కడ పేదలకు ప్రధాన ఆదాయవనరుగా ఉన్న కెందు ఆకు వ్యాపారంపై కేంద్రం విపరీతంగా జీఎస్టీ విధించిందని విమర్శించారు. బంగారంపై కేవలం మూడు శాతం జీఎస్టీ మాత్రమే వేయగా కెందు ఆకు వ్యాపారంపై 18శాతం విధించిందని మండిపడ్డారు. పేదలు, రైతులపై బీజేపీ మొసలి కన్నీరు కారుస్తోందన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద పంటల బీమా చెల్లింపులో కేంద్రం తీవ్ర జాప్యం చేస్తోందని ఆరోపించారు. పదంపూర్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు రైతులకు పంటల బీమా అందలేదన్నారు.

సినిమా బాగుందని ప్రశంసిస్తున్నారు: నవీన్‌చంద్ర



హైదరాబాద్: 'రిపీట్' చిత్రంలో మధుబాలతో కలసి నటించడం గొప్ప సంతృప్తినిచ్చింది. వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కించిన చిత్రమిది. సినిమా ఆద్యంతం ఎంగేజింగ్‌గా ఉందని చూసినవాళ్లు ప్రశంసిస్తున్నారు' అని నవీన్‌చంద్ర అన్నారు. అరవింద్ శ్రీనివాసన్ దర్శకత్వంలో, నవీన్‌చంద్ర హీరోగా నటించిన చిత్రం ఇది. డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సందర్భంగా నవీన్‌చంద్ర మీడియాతో ముచ్చటించారు. ఈ సినిమా తమిళ చిత్రం 'డెజావు'కు తెలుగు వెర్షన్. ఇందులో విక్రమ్ అనే పాత్రలో నటించాను. ఏకబిగిన చిత్రీకరణ పూర్తిచేశాం. మా దర్శకుడు చాలా సింపుల్‌గా తెరకెక్కించారు. పరిమిత బడ్జెట్‌లోనే సినిమాను బాగా రూపొందించారు. ఓటీటీ ప్రేక్షకులు నన్ను ఆదరిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఇటీవల ఓటీటీలో విడుదలైన 'పరంపర' నాకు మంచి పేరు తెచ్చింది. ప్రస్తుతం 'వీరసింహారెడ్డి', 'రామ్‌చరణ్ 15' సహా మరికొన్ని చిత్రాల్లో నటిస్తున్నాను' అని పేర్కొన్నారు.

విశ్వక్ వల్లే పెద్ద సినిమా అయింది

హైదరాబాద్: వికాస్ వశిష్ట, ప్రియా వడ్లమాని, చైతన్యారావ్, అయేషాఖాన్ ప్రధాన తారాగణంగా రూపొందిన సినిమా 'ముఖచిత్రం'. విశ్వక్‌సేన్ కీలకపాత్ర పోషించారు. గంగాధర్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'కలర్‌ఫొటో' చిత్ర దర్శకుడు సందీప్‌రాజ్ కథ, స్క్రీన్‌ప్లే అందించారు. ప్రదీప్ యాదవ్, మోహన్ యల్ల నిర్మించారు. ఈ నెల 9న విడుదలవుతోంది. గురు వారం చిత్రబృందం ట్రైల ర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా విశ్వక్‌సేన్ మాట్లాడుతూ "ముఖచిత్రం' షూటింగ్ చేస్తున్నన్ని రోజులు ఒక వైబ్రేషన్‌లో ఉండిపోయాను. థియేటర్‌లో చూడాల్సిన సినిమా ఇది' అన్నారు. విశ్వక్‌సేన్ కీలకపాత్ర చేయడం వల్ల 'ముఖచిత్రం' పెద్ద సినిమా అయిందని చిత్ర దర్శకుడు చెప్పారు. ఈ సినిమా కోసం అన్ని విభాగాలు పోటీపడి పనిచేశాయని సంగీత దర్శకుడు కాలభైరవ అన్నారు.

రాజమౌళి ఆస్తమాతో బాధపడుతూనే సినిమా పూర్తి చేశారు: శ్రియ

హైదరాబాద్: ఒక సినిమా వెనక కొన్ని వందల మంది కష్టం దాగి ఉంటుంది. ఎన్ని ఇబ్బందులు వచ్చినా లెక్కచేయకుండా ప్రేక్షకులను అలరించడం కోసం ఎంతో శ్రమిస్తుంది చిత్రబృందం. ఆరోగ్య సమస్యలు ఉన్నా సినిమా హిట్ అయితే అన్ని మర్చిపోతారు. సినిమా విజయంలో తెర ముందు హీరోలు నటీనటులైతే.. తెరవెనుక హీరోలు చాలా మంది ఉంటారు. అసలు విషయమేమిటంటే ఆర్‌ఆర్‌ఆర్ సినిమాకు ముందు దర్శకదిగ్గజం రాజమౌళి ఆరోగ్యసమస్యతో ఇబ్బంది పడ్డారట. ఈ విషయాన్ని స్టార్ హీరోయిన్ శ్రియ ఇటీవల ఓ ప్రముఖ మీడియా చానల్‌కు వెల్లడించింది. 'నాకు తెలిసినంత వరకు ఆర్‌ఆర్‌ఆర్ సినిమా ప్రారంభానికి ముందు రాజమౌళి ఆస్తమాతో బాధపడ్డారు. అయినా ఆయన ఏమీ పట్టించుకోలేదు. ఆయన దృష్టి అంతా కథను ఎలా ప్రజెంట్ చేయాలి అనే దాని మీదే ఉంటుంది. సెట్ అంతా దుమ్ము ఉన్నా అలానే వర్క్ చేస్తారు. తెరపై సినిమా అద్భుతంగా ఉండాలని తాపత్రయపడతారు" అంటూ రాజమౌళికి సినిమా అంటే ఎంత ఇష్టమో చెప్పింది శ్రియ.

సీపీఐ, సీపీఎంకు సీఎల్ రాయుడు కుటుంబం భూరి విరాళం

విశాలాంధ్ర- గన్నవరం: చింతపల్లి లక్ష్మారాయుడు, కాశీ అన్నపూర్ణమ్మ కళ్యాణ మండపం ప్రారంభం సందర్భంగా కృష్ణాజిల్లా బుద్దవరంలో జరిగిన సభలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, కార్యదర్శి వర్గసభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, నాయకులు కొండా వీరస్వామికి రూ1.50 లక్షల చెక్కును, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరవు, జిల్లా కార్యదర్శి వై.నరసింహారావుకు రూ. 1.50లక్షల చెక్కును చింతపల్లి లక్ష్మారాయుడు (సీఎల్ రాయుడు) కుటుంబ సభ్యుల తరుపున వారి కుమారుడు చింతపల్లి పాపారావు అందజేశారు. కళ్యాణ మండపం నిర్మాణానికి విశేషకృషి జరిపిన నక్కా రామారావుకు నూతన వస్త్రాలు అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి నాగ భూషణం, పాపారావు, ఎర్నేనేని అరుణకుమారి, వీరమాచినేని స్వరూప రాణి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

7న కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు

విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే

విద్యాశాఖాధికారికి ఎస్టీయూ తిమ్మన్న వినతిపత్రం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ విద్యా విధానం పేరుతో మూడు, నాలుగు, ఐదు తరగతులను దగ్గర్లో ఉండే హైస్కూళ్లలో విలీనం చేసి ఆ మేరకు ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం రెండింటిలో విఫలమై, ఇప్పుడు సర్దుబాటు పేరుతో విద్యా సంవత్సరం మధ్యలో ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదని, అత్యవసరమైతే ఉపాధ్యాయుల సంసిద్ధత పత్రం తీసుకొని సర్దుబాటు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నం విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం విద్యాశాఖ సంయుక్త సంచాలకులు మువ్వ రామలింగం చాంబర్‌లో ఆయనను ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, తిమ్మన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విద్యారంగ సమస్యలు పరిష్కరించని పక్షంలో ఈనెల 7వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 34 వేల మంది ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పిస్తున్నట్లు గత మార్చిలో హామీ ఇచ్చిన ప్రభుత్వం, చివరకు కేవలం నాలుగు వేల ప్రమోషన్లను మాత్రమే కేవలం పేపర్ మీద కల్పించి ఇంతవరకు వారికి పాఠశాలలు కేటాయించక పోవడం అత్యంత దురదృష్టకరమని వారు విమర్శించారు. ఉపాధ్యాయ బదిలీల పైన అనేక సమావేశాలు నిర్వహించి బదిలీల మార్గ దర్శకాలు తయారు చేసి ఇదిగో జీవో అదిగో జీవో అంటూ ఉపాధ్యాయులందరిలో ఆశలు రేకెత్తించి ఇప్పుడు బదిలీలు చేయకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. హైస్కూల్‌లో మూడు, నాలుగు, ఐదు తరగతులకు పాఠాలు బోధించడానికి మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటు పేరుతో విద్యా సంవత్సరం మధ్యలో ఉపాధ్యాయులను సుదూర ప్రాంతాలకు డిప్యుటేషన్ వేసి ఇబ్బందులకు గురి చేయడం తగదని, అత్యవసరమైతేనే వారి సంసిద్ధత పత్రంతో మండలం లోపల గాని చుట్టుపక్కల మండలాలలో గాని తాత్కాలిక సర్దుబాటు చేయాలని కోరారు. అదే విధంగా ఉపాధ్యాయుల ముఖ ఆధారిత హాజరు యాప్‌లో అనేక సమస్యలు ఉన్నాయని, సమైక్యాంధ్ర సెలవులు, నాడు నేడు హెడ్మాస్టర్ల ప్రత్యేక క్యాజువల్ సెలవులు, అదేవిధంగా సెలవు రద్దు, తదితర అంశాలు చేర్చాలని, సాంకేతిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఐపీఎల్‌కు డ్వేన్ బ్రావో గుడ్‌బై

చెన్నై: ఇటీవల వెస్టిండీస్ లెజెండ్ కీరన్ పొలార్డ్.. ఐపీఎల్‌కు వీడ్కోలు పలికాడు. ఆది నుంచి ఉన్న ముంబై ఇండియన్స్ జట్టుతోనే కలిసి ఉండాలని తను డిసైడ్ అయ్యాడు. అందుకే అతనికి ముంబై బ్యాటింగ్ కోచ్‌గా కొత్త బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ముంబై జట్టు ప్రకటించింది. ఇప్పుడదే బాటలో మరో విండీస్ లెజెండ్ నడిచాడు.

ఐపీఎల్‌లో ముగిసిన మరో శకం

చెన్నై సూపర్ కింగ్స్‌తో ఎన్నో ఏళ్లుగా కలిసి నడిచిన స్టార్ ఆల్‌రౌండర్ డ్వేన్ బ్రావో ఇకపై ఐపీఎల్‌లో తను ఆడటం లేదని సంచలన విషయం వెల్లడించాడు. ఇప్పటి వరకు 14 ఏళ్ల పాటు ఈ క్యాష్ రిచ్ లీగ్‌లో ఆడిన బ్రావో.. ఎన్నో మైలురాళ్లను అధిగమించాడు. అయితే ప్రతి దానికి ఒక ముగింపు ఉంటుందని, ఇక తను కూడా ఈ పాత్రను పక్కన పెట్టే సమయం వచ్చిందని బ్రావో అన్నాడు. వచ్చే ఏడాది నుంచి ఈ లీగ్ ఆడటం లేదని ప్రకటించాడు. అతను మినీ వేలంలో పేరు నమోదు చేసుకోక పోవడంతో ఇదే విషయంపై కొన్ని వార్తలు వచ్చాయి. చివరకు వీటిని 'ఛాంపియన్' బ్రావో నిర్ధారించాడు.

చెన్నై కోచ్‌గా బాధ్యతలు

ఐపీఎల్‌కు వీడ్కోలు పలికిన డ్వేన్ బ్రావో ఇకపై చెన్నై సూపర్ కింగ్స్ బౌలింగ్ కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. ప్రస్తుతం చెన్నై బౌలింగ్ కోచ్ లక్ష్మీపతి బాలాజీ వచ్చే ఏడాది విశ్రాంతి తీసుకోనున్నాడు. అతని స్థానంలో బ్రావో ఈ బాధ్యతలు నిర్వహిస్తాడని తెలుస్తోంది. దీని గురించి మాట్లాడిన బ్రావో.. తన కొత్త బాధ్యతను నిర్వర్తించేందుకు ఉత్సుకతతో ఉన్నానని చెప్పాడు. ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా తను నిలుస్తానని ఎప్పుడూ అనుకోలేదన్నాడు. కొత్త ప్రయాణం ఎలా ఉంటుందా అని ఎదురు చూస్తున్నానని చెప్పాడు.

చెన్నైతో అనుబంధం

ముంబై ఇండియన్స్‌తో తన ఐపీఎల్ ప్రయాణం ప్రారంభించిన డ్వేన్ బ్రావో.. ఆ తర్వాత 2011లో చెన్నైతో కలిశాడు. అప్పటి నుంచి చెన్నై తరపున అద్భుతంగా రాణిస్తూ 2011, 2012, 2021ల్లో ఐపీఎల్ ట్రోఫీ ముద్దాడాడు. తన కెరీర్‌లో 161 ఐపీఎల్ మ్యాచులు ఆడిన బ్రావో.. 158 వికెట్లు పడగొట్టాడు. గతేడాది వేలంలో అతన్ని రూ.4.4 కోట్లు పెట్టి చెన్నై కొనుగోలు చేసింది. ఈ సీజన్‌లో తను ఆడిన పది మ్యాచుల్లో 16 వికెట్లు తీసుకున్నాడీ విండీస్ ఆల్‌రౌండర్. ఈ క్రమంలో ఐపీఎల్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసుకున్న ఆటగాడిగా లసిత్ మలింగ రికార్డును కూడా బద్దలు కొట్టాడు.

రికీ పాంటింగ్‌కు గుండెపోటు

పెర్త్: ఆస్ట్రేలియా బ్యాటింగ్ దిగ్గజం, మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ అస్వస్థతకు గురయ్యాడు. మ్యాచ్ కామెంట్రీ చేస్తూ అనారోగ్యానికి గురవడంతో ఆసుపత్రిలో చేరినట్లు ఆస్ట్రేలియా మీడియా సంస్థలు వెల్లడించాయి. పాంటింగ్‌కు ఛాతిలో నొప్పి రావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. అయితే ఆరోగ్య పరిస్థితిపై ఎలాంటి స్పష్టమైన సమాచారం లేదు. పెర్త్ వేదికగా ఆస్ట్రేలియా, వెస్టిండీస్ మధ్య జరుగుతున్న టెస్టు మ్యాచ్ మూడో రోజు ఆటకు ఛానెల్ 7 తరపున పాంటింగ్ కామెంటటేర్‌గా ఉన్నాడు. ఈ మ్యాచ్‌కు 40 నిమిషాల పాటు వ్యాఖ్యాతగా వ్యవహరించిన 47 ఏళ్ల పాంటింగ్.. లంచ్ విరామం సమయంలో కామెంట్రీ బాక్స్ నుంచి వేగంగా బయటకు వెళ్లారని ఆస్ట్రేలియా మీడియా కథనాలు వెల్లడించాయి. పాంటింగ్ వెంట ఆయన స్నేహితుడు, ఆస్ట్రేలియా మాజీ కోచ్ జస్టిన్ లాంగర్ కూడా ఉన్నారు. ఛాతిలో నొప్పితో అసౌకర్యంగా ఉండటంతో ముందుజాగ్రత్త చర్యగా ఆసుపత్రిలో చేరినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. 1999 నుంచి 2007 వరకు ప్రపంచకప్‌లో వరుస విజయాలు సాధించిన ఆస్ట్రేలియా జట్టులో పాంటింగ్ భాగస్వామిగా ఉన్నాడు. 2006, 2009లో పాంటింగ్ నేతృత్వంలో ఆసీస్ వరుసగా రెండు సార్లు ఛాంపియన్ ట్రోఫీ సాధించింది. ప్రస్తుతం అతడు భారత టీ20 మెగా లీగ్‌లో ఢిల్లీ జట్టుకు హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు.

ఆస్ట్రేలియాతో సిరీస్‌కు తెలుగమ్మాయి

ఆదోని: ఏపీకి చెందిన యువ క్రీడాకారిణి భారత మహిళా క్రికెట్ జట్టుకు ఎంపికైంది. త్వరలో స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరగనున్న టీ20 సిరీస్‌కు జట్టును బీసీసీఐ ప్రకటించింది. ఆ జట్టులో కర్నూలు జిల్లా ఆదోని పట్టణానికి చెందిన అంజలి శర్వాణి ఎంపికైంది. డిసెంబర్ 9 నుంచి 20 వరకు ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్‌కు జట్టులో స్థానం సంపాదించుకుంది. టీమిండియాకు అంజలి శర్వాణి ఎంపిక పట్ల ఆదోని ప్రాంతంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఆమె కుటుంబసభ్యులకు స్థానికులు అభినందనలు తెలుపుతున్నారు. అంజలి తండ్రి పాఠశాల ఉపాధ్యాయుడు కాగా.. తల్లి గృహిణి. స్థానిక మిల్టన్ ఉన్నత పాఠశాలలో అంజలి పదోతరగతి వరకు చదివింది. ఆ తర్వాత క్రికెట్‌పై ఆమెకున్న ఆసక్తిని గమనించి తల్లిదండ్రులు.. ఆ రంగంలో ప్రోత్సహించారు. దీంతో క్రికెట్ వైపు అడుగులు వేసిన అంజలి.. అంచలంచెలుగా ఎదిగి భారత జట్టుకు ఎంపికైంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.